


TELANGANA SHASANA SABHA

TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ

తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 160 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | శుక్రవారం 15 నవంబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-

## "విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోతే ఊచలు లెక్కించాల్సి వస్తుంది"



- రూ.5వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్రంలో గత పదేళ్లలో 5వేల పాఠశాలలు మూతపడ్డాయి.
- బడ్జెట్‌లో 7 శాతానికి పైగా నిధులు విద్యాశాఖకు కేటాయించాం.
- పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించడానికి ఇష్టపడట్లేదు
- 11,062 టీచర్ పోస్టులు భర్తీ చేశాం.
- ఎలాంటి చెడు వ్యసనాలకు బానిసలు కాబోమని విద్యార్థులు ప్రమాణం చేయాలి

వివరాలు »»3లో

**శాసనసభ / హైదరాబాద్ :** విద్యార్థుల కలలను నిజం చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు.''రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి బాలల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం. జవహర్‌లాల్ నెహ్రూ భారత తొలి ప్రధానే కాదు.. దేశాన్ని ప్రపంచం ముందు గొప్పగా చూపించిన నేత. నవీన భారత రూపశిల్పి నెహ్రూ. రూ.5వేల కోట్లతో రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తాం. ఇటీవలే హాస్టల్ విద్యార్థులకు ఇచ్చే డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం. రాష్ట్రంలో గత పదేళ్లలో 5వేల పాఠశాలలు మూతపడ్డాయి. బడ్జెట్‌లో 7 శాతానికి పైగా నిధులు విద్యాశాఖకు కేటాయించాం. ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించాలని పదోన్నతులు ఇచ్చాం, బదిలీలు చేశాం. 11,062 టీచర్ పోస్టులు భర్తీ చేశాం. టీచర్ పోస్టుల భర్తీ ద్వారా విద్యపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని నిరూపించాం" అని సీఎం తెలిపారు.

## ఢిల్లీలో వాయుకాలుష్యం...

### ప్రైమరీ స్కూళ్లు మూసివేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం!



- స్టేజ్-3 ఆంక్షలు అమలు చేస్తున్నట్లు వెల్లడి
- 5వ తరగతి వరకు స్కూల్స్ మూసివేత
- ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని సీఎం ఆదేశాలు

**శాసనసభ / హైదరాబాద్ :** ఢిల్లీలో వాయుకాలుష్యం భారీగా పెరిగింది. దీంతో ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ-ఎన్సీఆర్ పరిధిలో శుక్రవారం నుంచి స్టేజ్-3 ఆంక్షలను అమలు చేస్తున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా ఢిల్లీలో ప్రైమరీ స్కూల్స్ మూసివేస్తున్నారు. వారికి ఆన్ లైన్ ద్వారా తరగతులు నిర్వహించాలని ముఖ్యమంత్రి అతిశీ ఆదేశాలు జారీ చేశారు.

మిగతా »»3లో

## ప్రధాని మోదీ వరల్డ్ రికార్డు... ఎందులో అంటే!



- అత్యధికంగా అత్యున్నత పౌర పురస్కారాలు అందుకున్న మోదీ
- మొత్తం 14 పురస్కారాలతో మోదీ టాప్
- పాప్యులారిటీ పరంగా ప్రపంచ నేతల్లో ముందున్న భారత ప్రధాని

మిగతా »»3లో

**ఢిల్లీ / శాసనసభ :** ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయంగా ఎంత క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పాప్యులారిటీ పరంగా ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నారు. సోషల్ మీడియాలో సరేసరి. ఎక్స్, ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్... ఇలా ఏ సోషల్ మీడియా వేదిక చూసినా మోదీ ఫాలోవర్స్ సంఖ్య కోట్లల్లో ఉంటుంది. ఇదిలా ఉంటే... పురస్కారాల పరంగానూ మోదీ అరుదైన ఘనత సాధించారు. వివిధ దేశాలు అందించే అత్యున్నత పౌర పురస్కారాలు పొందినవారిలో మోదీనే నెంబర్ వన్. ఇప్పటివరకు ఆయన 14 అత్యున్నత పౌర పురస్కారాలు అందుకున్నారు. మరే ప్రపంచ నేతకు ఇన్ని అవార్డులు దక్కలేదు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు:

### పోలీసుల ఎదుట హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఫోరెన్సిక్ నివేదిక
- చిరుమర్తి లింగయ్యకు నోటీసులు పంపిన పోలీసులు
- జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో విచారణ

మిగతా »»3లో

**శాసనసభ / హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు అందుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నేడు పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని ఏసీపీ కార్యాలయానికి వచ్చిన చిరుమర్తి లింగయ్య నుంచి పోలీసులు వాంగ్మూలం నమోదు చేశారు.



## ప్రభుత్వ పాలసీలపై అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటన

- పారిశ్రామిక రంగం అభివృద్ధికి ఏపీ సర్కారు నూతన పాలసీలు
- 2047 నాటికి ఏపీ నెంబర్ వన్ గా ఉండాలన్న చంద్రబాబు
- అందుకే ఈ పాలసీలు తీసుకువచ్చామని వెల్లడి

**అమరావతి / శాసనసభ :** ఏపీ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన పాలసీలపై సీఎం చంద్రబాబు సభా ముఖంగా ప్రకటన చేశారు. 2047 నాటికి ఏపీ దేశంలోనే నెంబర్ వన్ గా ఉండాలనే ఈ పాలసీలు తీసుకువచ్చామని వెల్లడించా రు. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త అనే నినాదాన్ని సాధ్యం చేసి చూపుతామని స్పష్టం చేశారు.రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల మందికి ఉపాధి రావాలనేది ప్రభుత్వ లక్ష్యమని, పెట్టుబడి ప్రాజెక్టులు నిర్దేశిత సమయానికి మొదలయ్యేలా ప్రత్యేక వ్యవస్థను తీసుకువస్తామని చెప్పారు.




## 'అవన్నీ అప్పులు చేసి కొన్నాం వాటి గురించి మీకెందుకు ?'

### ఎన్యూమరేటర్లకు ఎదురుప్రశ్నలు



- రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి సర్వే తీరు

మిగతా »»3లో

- 243 ఉప కులాల కోడింగ్ నెంబర్లు ఉండటంతో అరగంట నుంచి గంట సమయం
- ఇబ్బంది పడుతున్న ఎన్యూమరేటర్లు
- టీవీ, రిఫ్రిజిరేటర్, ద్విచక్రవాహనం, కారు, వాషింగ్‌మిషన్ వంటివి ఉన్నాయా అని అడుగుతున్నారు.
- అప్పుపై తీసుకుని కొన్నాం, అవి ఎందుకంటూ ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు.

## లగచర్ల రైతులు తమ భూములు ఇవ్వమంటున్నా భయపెడుతున్నారు

**శాసనసభ / హైదరాబాద్ :** లగచర్ల రైతులు తమ భూములు ఇవ్వమంటున్నా భయపెడుతున్నారు అని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. అనేక సంవత్సరాలుగా అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకారంతో వ్యవహరిస్తున్నారు..




యుద్ధ భూమి గా రేవంత్ రెడ్డి చేశారు. అని భారతీ య జనతా పార్టీ ఎంపీ ఆరోపించారు.

## ప్రశ్నిస్తే కేసులు పెడ్తరా?




- రిమాండ్ రిపోర్టుపై బలవంతంగా సంతకం
- రైతుల భూములు గుంజుకోవడమేనా ప్రజాస్వామ్యం
- చర్లపల్లి జైలులో పట్నంతో బీఆర్ఎస్ బృందం భేటీ

## మా పిల్లలకు ఉరి శిక్ష వేస్తామని బెదిరిస్తున్నారు..

### లగచర్ల బాధితురాలి ఆవేదన ఇదీ..




**శాసనసభ / హైదరాబాద్ :** కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా విలేజ్ ఏర్పాటు కోసం రైతుల నుంచి భూములను బలవంతంగా లాక్కొంటున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న రైతులు, వారి కుటుంబాలపై రేవంత్ సర్కార్ ఉక్కుపాదం మోపుతోంది.

శాసనసభ

శుక్రవారం 15 నవంబర్ - 2024

## ఇంటికో మనిషి-ఊరుకో బండి చలో మిర్యాలగూడ కు తరలి రావాలి



**చండూర్ నవంబర్ 14 శాసనసభ న్యూస్):** డిసెంబర్ 2న మిర్యాలగూడలో జరిగే బహిరంగ సభకు ఇంటికో మనిషి బి ఊరుకో బండి చలో మిర్యాలగూడకు తరలిరావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. గురువారం చండూరు మండల పరిధిలోని బోడంగి పర్తి గ్రామంలో మిర్యాలగూడ జరిగే బహిరంగ సభకరపత్రంను ఆవిష్కరించారు. అనంతరంబహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఇంటింటికి తిరిగిప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి బిజెపి అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వలన పారిశ్రామిక, వ్యవసాయరంగం తీవ్రంగా దివాలా తీసింది అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల ముందు మెని ఫెస్టోలో ఇచ్చిన ఆరు పథకాలను అమలు చేయాలనిఆయన అన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని ఆయన అన్నారు. దేశంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన మోడీ నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం జమిలి ఎన్నికలు తీసుకురావడానికిప్రయత్నం చేస్తుందని, ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు. మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలను అనుసరిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, బిఎస్ఎన్ఎల్, విమాన యానం, ఎల్ఐసి, గనులు సహజ వనరుల మొత్తాన్ని స్వదేశీ విదేశీ పెట్టుబడిదారులకు దారా దత్తం చేస్తుందని ఆయన విమర్శించారు. రాజ్యాంగ బద్ధంగా ప్రజాస్వామ్య యుతంగా పాలన చేయవలసిన మోడీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్యన విద్వేషాలు రెచ్చగొడుతుందని, ఈ మతోన్మాద విధానాలపై భవిష్యత్తులో ప్రజలను సమీకరించి చైతన్యం చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ, సిపిఎం బోడంగపర్తి గ్రామ శాఖ కార్యదర్శి గౌసియా బేగం, సిపిఎం నాయకులు ఈరటి వెంకన్న,గిరి,సైదులు, జాంగిర్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ముఠా గుట్టురట్టు..




**శాసనసభ / హైదరాబాద్ ప్రతినిధి :** ఫేక్ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ముఠా గుట్టురట్టు అయింది. నకిలీ ఓటర్ కార్డు, ఆధార్, బర్త్ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ముఠాను నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.మహంకాళి పోలీసులతో కలిసి జాయింట్ అపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆరుగురు నిందితులు హైదారాబాద్ కి చెందిన వాళ్ళే అని తేలింది. వందలాది ఓటర్ కార్డులు, ఆధార్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫేక్ సర్టిఫికెట్లతోనే ఇప్పటికే కొందరు యువతీ యువకులు పాస్ పోర్ట్ లు తీసుకున్నారు.కాగా, గెజిటెడ్ ఆఫీసర్స్ పేర్లతో నకిలీ స్టాంపులు కూడా స్వాధీనం చేసుకున్న పోలీసులు. నిందితులు ఎలగం రాజ్ కుమార్, మహబూబ్, రాచమల్ల విజయ లక్ష్మీ, కూరపాటి పల్లవి, బండి శంఖర్, గిరిరాజ్ అనిల్ కుమార్ అనే నిందితులను నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ డీసీపీ సుధీంద్ర మాట్లాడుతూ.. సికింద్రాబాద్ కి చెందిన ఎలగం రాజ్ కుమార్ 10 ఏళ్లుగా ఆన్లైన్ సెంటర్ నిర్వహిస్తున్నాడని తెలిపారు. ఇతని దగ్గర రాచమల్ల విజయ లక్ష్మి, పల్లవి పనిచేస్తున్నారు.. తన ఆన్లైన్ సెంటర్ లో ఇద్దరు మహిళల సహాయంతో ఫేక్ సర్టిఫికెట్లు సృష్టిస్తున్నాడు.. ఫేక్ ఆధార్ కార్డ్ లు, ఫేక్ ఓటర్ ఐడి, ఫేక్ పాన్ కార్డ్ లతో నకిలీ బర్త్ సర్టిఫికెట్లు క్రియేట్ చేస్తున్నారు.. ఫేక్ ఓటర్ కార్డులతో ఆధార్ కార్డుల్లో అడ్రస్ చేంజ్ లాంటివి చేస్తున్నారు.. అధికారులకు తెలియకుండానే.. వాళ్ళ పేర్ల మీద నకిలీ స్టాంప్ లు తయారు చేసారని టాస్క్ ఫోర్స్ డీసీపీ సుధీంద్ర వెల్లడించారు.అలాగే, మహబూబ్ అనే వ్యక్తి సర్వశిక్ష అభియాన్ లో కాంట్రాక్ట్ వర్కర్ గా పని చేస్తున్నాడని టాస్క్ ఫోర్స్ డీసీపీ సుధీంద్ర తెలిపారు. స్కూల్స్ లో మాత్రమే ఆధార్ కార్డుల్లో ఏవైనా మార్పులు ఉంటే చేసే అధికారం ఉంది. కానీ, అనధికారికంగా రాజ్ కుమార్ కి చెందిన ఆన్లైన్ సర్వీస్ సెంటర్ కి కూడా పనులు చేసి పెట్టాడని పేర్కొన్నారు. వీళ్ళకు పాస్ పోర్ట్ లు ఇప్పించే ఏజెంట్ బండి శంకర్ పరిచయం అయ్యాడు.. పాస్ పోర్ట్ కోసం తన దగ్గరికి వచ్చిన వాళ్లకు.. రాజ్ కుమార్ ముఠా సహాయంతో నకిలీ సర్టిఫికెట్లతో పాస్ పోర్ట్ లు ఇప్పించాడన్నారు.

# ప్రతి ఒక్కరూ స్వయం కృషితో ఎదగాలి

### స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి
### ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి
### ఘనంగా ఆదిభట్ల టీసీఎస్ వద్ద జస్ట్ బేక్ ప్రారంభం





**ఆదిభట్ల / శాసనసభ న్యూస్ ప్రతినిధి (, నవంబర్ 14 ) :** ప్రతి ఒక్కరూ స్వయం కృషితో ఎదగాలని ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని అన్నారు. యువత స్వయం కృషితో ఎదిగి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. గురువారం ఆదిభట్ల మున్సిపాలిటీలోని టీసీఎస్ వద్ద నూతనంగా నెలకొల్పిన జస్ట్ బేక్ ను ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మర్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ...యువత స్వయం కృషితో ఎదిగి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ఉద్యోగాల కోసం పరితపించకుండా స్వయంగా ఉద్యోగ అవకాశాలు కల్పించుకోవాలని అన్నారు. యువత, ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగి నలుగురికి ఆదర్శంగా నిలవాలన్నారు. యువత ఆర్థికంగా,సామాజికంగా అన్ని రంగాల్లో ఎదిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. స్వయం కృషితో ఎదిగి తమ ఆర్థిక,స్థితిగతులను మెరుగు పరుచుకోవాలని సూచించారు. స్వయం కృషితో ఎదిగి నలుగురికి ఆదర్శంగా నలుగురికి ఉపాధి చూపించే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు.ఆదిభట్ల మున్సి పాలిటీ పేరుకు చిన్నదే అయిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిందన్నారు. ఏరో స్పేస్, టీసీఎస్, టాటా కంపెనీ లాంటి సంస్థలకు నెలవుగా ఉందన్నారు. వినియోగదారులకు సరళమైన ధరలకు అందించి వినియోగదారుల మన్ననలు పొందాలని ఆకాంక్షించా రు.అనంతరం జస్ట్ బేక్ నిర్వాహకులు పల్లె మినేందర్ గౌడ్, అరుణ్ రెడ్డి లను అభినందించారు. అనంతరం జస్ట్ బేక్ నిర్వాహకులు మర్రి నిరంజన్ రెడ్డి, తదితరులకు పూలబోకేను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జస్ట్ బేక్ నిర్వహకులు పల్లె మినేందర్ గౌడ్, అరుణ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి, దెంది రాంరెడ్డి, ఎమ్మన్నార్ యువసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ కారింగ్ రవి కి ఘనసన్మానం




**చండూర్ నవంబర్ 14 (శాసనసభ న్యూస్):** గురువారం రోజున స్థానిక సాయి దుర్గ కమర్షియల్ కాంప్లెక్స్ చాకలి ఐలమ్మ సంఘం తెలంగాణ రీ నెం:375/2010 ఆధ్వర్యంలో ఐలమ్మ స్ఫూర్తి సన్మానం చండూరు మున్సిపాలిటీ కేంద్రంలో సంఘం ఫౌండర్ చైర్మన్ ఐదారి కలం నాగిళ్ళ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా భూతరాజు దశరథ,దోటి వెంకటేష్ యాదవ్ పాల్గొని శాలువా కప్పి సన్మానం చేయగా ఫౌండర్ చైర్మన్ ఐలమ్మ చిత్రపటం అందించి సన్మానించారు.ఇప్పటి వరకు వివిధ సామాజిక కార్యక్రమాల ద్వారా పదిహేడు వందలకు పైగా ఐలమ్మ చిత్రపటాలు మూడు వందలకు పైగా ఐలమ్మ చరిత్ర పుస్తకాలు భావజాల వ్యాప్తి భాగంగా పంచడం జరిగిందని దీనితోపాటే చాకలి ఐల్లమ్మకు స్ఫూర్తిగా కార్యక్రమాలనీ ప్రతి ఒక్కరు తమకు తాను కాపాడుకునే క్రమంలోనే చాకలి ఐలమ్మ తమ జరిగిన అన్యాయం ఎవరీ జరగకూడదని భూమి భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం ప్రజలతో మమేకమై పోరాడిందని దానితో చరిత్రలో సబ్బండ వర్గాల మేల్కొల్పు గాత్రం-చాకలి ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగింపు... నిరంతరస్ఫూర్తిగా నిలిచిందని అదే తరహాలో.ఈ కరాటే కార్యక్రమాలు కూడా వివిధ గ్రామాల్లో విద్యార్థిని, విద్యార్థులు నేర్చుకోవాలని అన్నారు. ఈ నెల నవంబర్ 10 ఆదివారం నాడు చోటేకన్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా చండూరు మండల కేంద్రానికి చెందిన మాస్టర్ కారింగ్ రవి ఆధ్వర్యంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు చండూర్ నుండి 17మంది విద్యార్థులతో పాల్గొనగా 17 మంది రావడం మూడు గోల్డ్ మెడల్ ఏడూ సిల్వర్ మెడల్ ఏడూ బ్రాజ్ మెడల్ సాధించినందుకు గాను సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బోడ శ్రీకాంత్ భీమనపల్లి ముత్యం భూతారాజు దేవదాసు భూతారాజు సూర్యం అయితరాజు మల్లేష్ పొన్నల లింగయ్య దోటి నాగరాజు కొత్త అంజి బాబు బొడ వెంకటేష్ మార్గోని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ లో ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు

### - బాల్యం భగవంతుడు ఇచ్చిన ఓ అమూల్యమైన వరం
### - ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు

**చండూర్ నవంబర్ 14 (శాసనసభ న్యూస్):** అందరూ అనుభవించే బాల్యం భగవంతుడు ఇచ్చిన అమూల్యమైన వరం అని అన్నారు గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు. స్థానిక గాంధీజీ విద్యాసంస్థల యందు నవంబర్ 14, జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా గురువారంనాడు జరిగిన బాలల దినోత్సవ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభం, శుభం తెలియని ఆ పసి మనసులు పూతోటలో అప్పుడే పరిమళించిన పువ్వులని, అందుకు సూచికగా ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాలలో బాలల దినోత్సవంలు జరుపుకుంటారని, అలాగే మనదేశంలో ప్రతి సంవత్సరం నవంబర్ 14న బాలల దినోత్సవం జరుపుకుంటామన్నారు, నెహ్రూ కు పిల్లలతో ఉన్న బాంధవ్యాన్ని తెలుపుతూ ఈ ఉత్సవం జరుపుకుంటారన్నారు. పిల్లలు నెహ్రూను చాచా నెహ్రూ అని ప్రేమగా పిలిచేవారన్నారు. భారత తపాలా శాఖ ప్రతి సంవత్సరం ఈరోజు తపాలా బిళ్ళను విడుదల చేస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి ఎంతో ఉన్నత స్థాయికి చేరాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత ఫలితాలు సాధిస్తారన్నారు. దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు అలరించారు. వారు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్స్ సత్యనారాయణమూర్తి, పులిపాటి రాధిక, కందుల కృష్ణయ్య, విజయ కుమారి, తరుణ్ మాస్టర్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.






## కొబ్బరి నీళ్లలో కొద్దిగా ఉప్పు కలిపి తాగితే శరీరానికి ఏమవుతుందో తెలుసా?



కొబ్బరి నీరు ప్రకృతిద్వారా అందించిన ఒక శుద్ధమైన, ఆరోగ్యకరమైన పానీయం. ఇది సహజసిద్ధమైన ఎలక్ట్రోలైట్స్, విటమిన్లు, ఖనిజాలు కలిగిన పానీయం కావడంతో ఆరోగ్యానికి చాలా మంచిది.కొబ్బరి నీరులో కొద్దిగా ఉప్పు కలిపి తాగడం కూడా ఆరోగ్యపరంగా కొన్ని ప్రయోజనాలు కలిగి ఉంటుంది, కానీ కొన్నిసార్లు దానికి ప్రతికూల ఫలితాలు కూడా కలగవచ్చు.

**ప్రయోజనాలు :** హైడ్రేషన్: కొబ్బరి నీరులో సహజసిద్ధమైన ఎలక్ట్రోలైట్స్ ఉండటం వల్ల ఇది శరీరాన్ని తక్షణమే హైడ్రేట్ చేస్తుంది. కొద్దిగా ఉప్పు కలపడం వల్ల శరీరం మరింత సమర్థవంతంగా నీటిని గ్రహిస్తుంది. ఇది వ్యాయామం తరువాత లేదా గరిష్ట వేడిలో బయట ఉన్నప్పుడు శరీరంలో తేమను తిరిగి పొందడంలో సహాయపడుతుంది.

**ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్ :** కొబ్బరి నీరులో ఉన్న పొటాషియం, సోడియం వంటి ఎలక్ట్రోలైట్స్ శరీరంలో సోడియం స్థాయిలను సమతుల్యం చేయడంలో సహాయపడతాయి. కొద్దిగా ఉప్పు కలపడం ద్వారా సోడియం స్థాయిని మరింత పెంచుకోవడం సాధ్యమవుతుంది, ఇది నీటిని తక్కువగా విడిచిపెట్టేలా చేయడంలో సహకరిస్తుంది.

**ఎసిడిటీ తగ్గించడం :** కొబ్బరి నీరు త్రాగడం వల్ల ఆమ్లాన్ని తగ్గిస్తుంది. కొద్దిగా ఉప్పు కలపడం వల్ల ఇది మరింత సమర్థవంతంగా పని చేస్తుంది. ఇది గ్యాస్ట్రిక్ సమస్యలను తగ్గించడంలో సహకరిస్తుంది.

**జీర్ణ ప్రక్రియకు సహాయం :** కొబ్బరి నీరు సహజంగా తేలికగా ఉండి జీర్ణ ప్రక్రియను సులభతరం చేస్తుంది. కొద్దిగా ఉప్పు కలపడం ద్వారా జీర్ణక్రియను పెంపొందించుకోవచ్చు, ఇది ఆహారాన్ని సరిగ్గా జీర్ణం చేయడంలో సహాయపడుతుంది.మానసిక ఉల్లాసం: కొబ్బరి నీరు హైడ్రేషన్‌తో పాటు, సహజమైన తీపి రుచి కలిగి ఉండటం వల్ల మానసికంగా రిఫ్రెష్‌గా అనిపిస్తుంది. కొద్దిగా ఉప్పు కలిపితే ఇది శరీరానికి తక్షణ శక్తినిచ్చే పానీయం అవుతుంది.

**నష్టాలు : బ్లడ్ ప్రెజర్ పెరగడం :** కొబ్బరి నీరులో తక్కువ మోతాదులో ఉప్పు చాలు. ఎక్కువగా ఉప్పు కలపడం వల్ల రక్తపోటు ఉన్న వారికి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. సోడియం అధికంగా తీసుకోవడం వల్ల రక్తపోటు పెరుగుతుందనే ప్రమాదం ఉంది.

**వయస్సుతో సంబంధం ఉన్న ఆరోగ్య సమస్యలు :** వృద్ధాప్యంలో ఉన్నవారు ఎక్కువగా ఉప్పు కలిపిన పానీయాలు తీసుకోవడం వల్ల మోకాళ్ళ నొప్పులు లేదా ఎడిమలు రావడం వంటి సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంది.విరేచనాలు: కొబ్బరి నీరు సహజమైన డైయూరెటిక్ కావడం వల్ల, అధిక మోతాదులో తాగితే విరేచనాలు రావచ్చు. అలాగే, ఉప్పును మించికలిపితే ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది.

**అధిక సోడియం వల్ల పొటాషియం లోపం :** కొబ్బరి నీరు సహజసిద్ధంగా పొటాషియం శాతం ఎక్కువగా కలిగి ఉంటుంది. కానీ అధికంగా ఉప్పు కలపడం వల్ల శరీరంలో సోడియం స్థాయి పెరిగి, పొటాషియం స్థాయి తగ్గే అవకాశం ఉంటుంది. ఇది శరీర తల్లడిల్లడానికి దారితీస్తుంది.

**రుచి ప్రభావం :** కొబ్బరి నీరులో ఎక్కువ ఉప్పు కలపడం వల్ల దాని సహజమైన తీపి రుచి తగ్గిపోతుంది. ఈ రుచి మార్పు కారణంగా కొబ్బరి నీరు త్రాగడంలో ఇష్టపూర్వకత తగ్గవచ్చు.సరియైన మోతాదులో కొబ్బరి నీరులో ఉప్పు కలిపి తాగడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది, కానీ మితిమీరితే దుష్ప్రభావాలు కలుగుతాయి. అందువల్ల, ఉప్పును తగిన మోతాదులోనే కలిపి తాగడం, అవసరమైనప్పుడు మాత్రమే కొబ్బరి నీరును వినియోగించడం మంచిదని భావించాలి.

## పరగడుపున నిమ్మరసం తేనె తాగుతున్నారా?
## ఒక్కక్షణం ఆగండి!



చాలామంది ఉదయం పరగడుపున నిమ్మరసం తేనే తాగుతూ ఉంటారు. అయితే నిమ్మరసం తేనె పరగడుపున తాగడం మంచిదేనా? నిమ్మరసం తేనె గ్లాసు వేడి నీళ్లలో కలుపుకొని ఉదయాన్నే తాగడం వల్ల ఏం జరుగుతుంది అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం.ఉదయాన్నే నిమ్మరసం తేనే తాగడం మంచిదని పరగడుపున తాగితే బరువు తగ్గడానికి ఇది దోహదం చేస్తుందని చాలామంది చెబుతారు.

**ఉదయాన్నే పరగడుపున నిమ్మరసం, తేనె తాగుతున్నారా?**

అయితే ఖాళీ కడుపుతో నిమ్మరసం, తేనె కలిపి తాగితే ఆరోగ్యానికి మంచిది కాదని పలువురు ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు. ఉదయాన్నే నిద్ర లేచిన తర్వాత పరగడుపున కాస్త గోరువెచ్చని నీళ్లను తాగాలని ఆ తర్వాత నిమ్మరసం తేనే తాగొచ్చని చెబుతున్నారు. ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగడం వల్ల మన పొట్టలో యాసిడ్ పరిమాణం పెరుగుతుందని నిమ్మకాయలో ఉండే ఆమ్లా లక్షణాలు మన జీర్ణ వ్యవస్థపైన ప్రభావాన్ని చూపిస్తాయని చెబుతున్నారు.

**ఖాళీ కడుపుతో నిమ్మరసం, తేనె తాగితే ప్రమాదం :** ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగడం వల్ల ఎముకల సమస్యలు, దంత సమస్యలు, డిహైడ్రేషన్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని చెబుతున్నారు. తరచూ మూత్ర విసర్జన వంటి సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి పళ్ళు తోముకుని మొదట రెండు గ్లాసుల నీళ్లు తాగాలాని చెప్తున్నారు.

**నిమ్మరసం తేనే తాగేవారు అనుసరించాల్సిన విధానం ఇదే :** ఆ తర్వాత ఒక గ్లాసు గోరువెచ్చని నీటిని తీసుకుని అందులో ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసాన్ని, ఒక టేబుల్ స్పూన్ తేనెను కలుపుకొని తాగితే మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు. ఇక నిమ్మరసం తేనే తాగేవారు ప్రతిరోజు ఇదే విధానాన్ని అనుసరిస్తే మంచిదని శరీరంలో మెటబాలిజం పెరిగి అదనపు కొవ్వును కరిగించడానికి దోహదం చేస్తుందని చెబుతున్నారు.

**పరగడుపున నిమ్మరసం తేనె తాగేవారికి సూపర్ టిప్ :** ఇలా తాగినప్పుడు ఇది మన బరువును తగ్గించడానికి ఎంతగానో దోహదం చేస్తుందని సూచిస్తున్నారు. మన రోగనిరోధక శక్తి బలోపేతం కావడానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరడానికి ప్రతి రోజు నిమ్మరసం తేనే తీసుకునేవారు ఖాళీ కడుపుతో నిమ్మరసంతో, తేనె తాగకుండా మొదట కొంత నీళ్లు తాగిన తర్వాత నిమ్మరసం తేనే తాగితే మంచిదని చెబుతున్నారు. ఇక ఈ చిన్న టిప్ ను పాటిస్తే మనకు జీర్ణ సంబంధమైన ఎటువంటి ఇబ్బంది కలగదని చెప్తున్నారు.

తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక

శుక్రవారం 15 నవంబర్ - 2024

# డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులపై ఏసీపీ వీరంగం!



శాసనసభ / హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులకు సహకరించకుండా వారిపై ఓ పోలీసు ఉన్నతాధికారి చిందులు తొక్కారు. తాను ఉన్నతాధికారినంటూ తమను తనిఖీ చేయవద్దని కేకలు వేశారు.దీంతో పోలీసు అధికారులు ఆయనపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ సహా మరో ముగ్గురు మంగళవారం రాత్రి సఫారీ కారులో అమీర్‌పేట నుంచి ఎస్ఆర్ నగర్ వైపునకు వెళ్లారు. అక్కడ ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండటాన్ని గమనించారు.వెంటనే తాగి డ్రైవింగ్ చేస్తున్న కారు డ్రైవర్ వాహనాన్ని పక్కకు ఆపి తన సీటు నుంచి కిందకు దిగి వెనకాల సీటులోకి వెళ్లాడు. వెనకున్న వ్యక్తి డ్రైవింగ్ సీట్లోకి మారాడు. అయితే, అక్కడే విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ కావేరి ఇదంతా గమనించింది. వెనక సీట్లోని వ్యక్తి డ్రైవింగ్ చేశాడని ఆమె అక్కడున్న పోలీసు అధికారులకు చెప్పారు. తనిఖీల్లో భాగంగా వారి కారును ఆపి వెనుక కూర్చున్న డ్రైవర్‌ను బ్రీత్ అనలైజర్ పరీక్ష చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు యత్నించారు.అంతలో కారులోని వ్యక్తి కిందకు దిగి తాను సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ అని, తమ కారు వదిలేయాలని తనిఖీ చేస్తున్న పోలీసులను హెచ్చరించారు. కారు నడిపిన జైపాల్ రెడ్డిని వదిలేయాలని గట్టిగా కేకలు వేశాడు.దీంతో బ్రీత్ అనలైజర్ పరీక్షకు డ్రైవర్ మొండికేశాడు. మరోవైపు, ఊదొద్దని అతనికి ఏసీపీ సుమన్ కుమార్ అడ్డుపడ్డాడు. అంతటితో ఆగకుండా అక్కడ తనిఖీలు చేసే కానిస్టేబుల్‌ను ఏసీపీ సుమన్ కుమార్ తోసేశాడు.కారు బానెట్ పై గుద్దుతూ దూషిస్తూ, హల్‌చల్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు సుమన్ కుమార్. దీంతో ట్రాఫిక్ పోలీసులు మధురానగర్ పోలీసులకు సమాచారం అందించారు. కారు నడిపిన జైపాల్ రెడ్డిని పోలీస్ స్టేషన్‌కు తరలించి బ్రీత్ అనలైజర్ పరీక్షించగా మద్యం తాగినట్లు తేలింది.డ్రైవింగ్ చేసిన వ్యక్తి జైపాల్ రెడ్డి అని, అతడు అల్వాల్‌కు చెందిన వ్యాపారిగా పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్, కారు నడిపిన జైపాల్ రెడ్డి, వారితో పాటు ఉన్న శ్రీనివాస్, వెంకట్ రావులపై ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ ఎస్సై కాంతరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వారందరినీ అరెస్ట్ చేసినట్లు మధురానగర్ పోలీసులు తెలిపారు. కాగా, ఏసీపీకి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సదరు అధికారిపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యత గల పోలీసు అధికారి అయి ఉండి ఇలా ప్రవర్తించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

## ప్రభుత్వ పాలసీలపై అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటన

పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈలు ఏర్పాటు చేయాలనేది లక్ష్యమని, ఎంఎస్ఎంఈల ద్వారా రూ.50 వేల కోట్ల పెట్టుబడులు ఆశిస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్పత్తిలో ఏపీని గ్లోబల్ డెస్టినేషన్ గా మార్చాలనేది ప్రభుత్వ విధానమని తెలిపారు. అదే సమయంలో రూ.83 వేల కోట్ల విదేశీ పెట్టుబడులు రావాలని ఆశిస్తున్నామని తెలిపారు. ఏ పాలసీ అయినా 2024 నుంచి 2029 వరకు కచ్చితంగా అమల్లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు.రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ప్రతి చోట ఒక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. పారిశ్రామిక పార్కులు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ఉంటాయని అన్నారు. పోర్టు ఆధారిత పరిశ్రమల ద్వారా ఏపీని అభివృద్ధి పథంలో నిలుపుతామని చెప్పారు. ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాలు ఇచ్చేలా కొత్త విధానాలు అమలు చేస్తామని తెలిపారు. “రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందిస్తాం. అమరావతి, విశాఖ, రాజమండ్రిలో ఇన్నోవేషన్ హబ్ లు ఏర్పాటవుతాయి. విజయవాడ, తిరుపతి, అనంతపురంలో టాటా ఇన్నోవేషన్ హబ్ లు వస్తున్నాయి. రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల మహిళలు పారిశ్రామికంగా ఎదిగేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తాం. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. డ్రోన్ దీదీ కేంద్ర పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు డ్రోన్ పైలెట్ గా ట్రైనింగ్ ఇస్తాం. వ్యవసాయ రంగంలో 10 వేల మందికి పైగా మహిళలకు డ్రోన్లపై శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీలో భాగం ప్రతి ఉత్పత్తికి ఒక క్లస్టర్ ఏర్పాటు చేస్తాం. పండించే పంటకు విలువ జోడిస్తేనే అధిక ఆదాయం పొందవచ్చు. విలువ జోడించడం ద్వారా ఏపీ ప్రపంచానికే ఫ్రూట్ బాస్కెట్ గా అవతరిస్తుంది” అని చంద్రబాబు వివరించారు.

# ప్రజా పాలన విజయోత్సవ వేడుకలపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు




శాసనసభ / హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్న నేపథ్యంలో చేపట్టనున్న “ప్రజాపాలన – ప్రజా విజయోత్సవ” కార్యక్రమాలపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాది కాలంలో సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాలు, వివిధ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా సూచించారు.ప్రజాపాలన విజయోత్సవాల కు సంబంధించి డిసెంబర్ 9 వరకు చేపట్టనున్న కార్యక్రమాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే ఏడాది కాలంలోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినందున వాటన్నంటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం చెప్పారు. ఈ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మూడు ప్రాంతాలు వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తారు.మహిళల సాధికారత, రైతుల సంక్షేమం, యూత్ ఎంపవర్‌మెంట్‌కు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిన నేపథ్యంలో వాటికి సంబంధించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతారు. నవంబర్ 19న వరంగల్ వేదికగా 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు సీఎం శంకుస్థాపన చేస్తారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ ట్యాంక్‌బండ్, సెక్రటేరియట్, నెక్లెస్‌రోడ్ పరిసరాల్లో విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తారు.సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా డిసెంబర్ 9న సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేయనున్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ జరుగుతుంది. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆహ్వానిస్తారు. ఈ విజయోత్సవాల నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు తొలి ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలు, కార్యక్రమాలపై శాఖలు, విభాగాల వారిగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, కె.కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

( మొదటి పేజీ తరువాయి )

# ‘అవన్నీ అప్పులు చేసి కొన్నాం - వాటి గురించి మీకెందుకు?’ : ఎన్యూమరేటర్లకు ఎదురుప్రశ్నలు

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వే రాష్ట్రంలోని జిల్లాల్లో కొనసాగుతోంది. ఈ నెల 6 నుంచి 8 వరకు ఎన్యూమరేటర్లు ఇంటింటికీ స్టిక్కరింగ్ పూర్తి చేశారు. 9 నుంచి సర్వే ప్రారంభించారు. ప్రతి ఇంట్లో నివసించే వారి సంఖ్యను నిర్ధారించడంతో పాటు ప్రతి కుటుంబం ప్రాథమిక సమాచారం సేకరించి ఫారంలో నమోదు చేస్తున్నారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 నుంచి 175 ఇళ్లు ఇచ్చారు. 56 ప్రధాన ప్రశ్నలు, 19 ఉప ప్రశ్నలు, 243 కోడింగ్ నెంబర్లతో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. కుటుంబంలో మందిని బట్టి అరగంట నుంచి గంట సమయం పడుతోంది. సర్వే తీరుపై కొన్ని ప్రాంతాల్లో ‘ఈటీవీ భారత్’ పరిశీలన చేపట్టింది.సర్వేలో ఇచ్చిన బుక్‌లెట్ ఆధారంగా ఫారం నింపాల్సి వస్తోంది. కేటగిరీల వారీగా బుక్‌లెట్ చూసుకుంటూ నింపడానికి ఇబ్బందులు పడుతున్నారు. సహాయకులు కావాలని అడుగుతున్నారు. 19వ కాలంలో చేస్తున్న కుల వృత్తి చెప్పడానికి వెనకాడుతున్నారు. కుల వృత్తి చేయకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.టీవీ, రిఫ్రిజిరేటర్, ద్విచక్రవాహనం, కారు, వాషింగ్‌మిషన్ వంటివి ఉన్నాయా అని అడుగుతున్నారు. వీటిని అప్పుపై తీసుకుని కొన్నాం, అవి ఎందుకంటూ ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు. రుణాల విషయంలో వివరాలు తెలపడానికి నిరాకరిస్తున్నారు.కొన్నిచోట్ల కులం తెలిపే క్రమంలో ఉప కులాలు చెప్పడంలో కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదాయం పన్ను కట్టేవారు సైతం చెప్పడానికి ఇష్టపడటం లేదు. కొంతమంది సొంత ఇల్లు ఉన్నా, అద్దె ఇంట్లో ఉంటున్నామని చెబుతున్నట్లు ఎన్యూమరేటర్లు వాపోతున్నారు. పట్టణాలు, గ్రామాల్లోని కొన్ని చోట్ల ఇళ్లకు తాళం వేసి ఉంటున్నాయి. ఒక వేళ ఇంట్లో పెద్దలు ఉన్నా ఎన్యూమరేటర్లకు సరైన సమాధానం లభించడం లేదు. రుణాలు, ఆధార్‌కార్డులు, ధరణి పాసు పుస్తకాలపై సరైన సమాచారం ఇవ్వకుండా తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది.వృత్తికి సంబంధించి గృహిణిలు రోజూ వారి కూలీగా నమోదు చేసుకుంటున్నారు. ప్రజలు చెప్పిన సమాచారాన్ని తీసుకోవాలనే నిబంధన ఉండటంతో వారు చెప్పిందే ఎన్యూమరేటర్లు నమోదు చేసకుంటున్నారు.ప్రశ్నలు అధికం, సమాధానాలు స్వల్పం : పలుచోట్ల సమగ్ర ఇంటింటా సర్వే తీరు పరిశీలించగా, మొత్తం 75 ప్రశ్నలకు ఇంటి కుటుంబ సభ్యులు సరైన సమాధానాలు చెప్పట్లేదు. కొన్నిచోట్ల వాయిదాల ప్రకారం తీసుకున్న రుణాల వివరాలను చెప్పడంలో ఇబ్బంది పడుతున్నారు. వాయిదాలు చెల్లించగా బ్యాంకు, ఇతర సంస్థల్లో ఎంత బాకీ ఉందన్న విషయం చెప్పట్లేదు. ఒక కుటుంబం వివరాల నమోదుకు సుమారు గంట సమయం పడుతోంది. కొన్ని ప్రశ్నలకు ప్రత్యేక కోడ్‌ను కేటాయించడంతో సిబ్బంది సమన్వయంతో పని చేయాల్సి వస్తుంది. గ్రామాల్లో వ్యవసాయ పనులు ఉండటంలో ప్రజలు అందుబాటులో ఉండటం లేదు.

# ప్రశ్నిస్తే కేసులు పెడ్తరా?

పట్నం నరేందర్‌రెడ్డి అరెస్ట్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని, తన ప్రత్యర్థిగా ఉన్న పట్నంపై ప్రతీకారంతో రేవంత్ కుట్రపూరితంగా అరెస్ట్ చేయించారని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మేలు జరుగుతుందనుకున్న పాపానికి లగచర్ల గిరిజనుల భూములను గుంజుకోవడమే వారికి నువ్వు చేసే మేలా అని సీఎంను ప్రశ్నించారు. కొడంగల్ నుంచే ప్రజాపాలనమీద ప్రజల తిరుగుబాటు మొదలైందని, రేవంత్‌ను గద్దె దించే వరకు నిద్రపోమని హెచ్చరించారు. లగచర్ల కేసులో అరెస్టయిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో గురువారం చర్లపల్లి సెంట్రల్ జైలులో హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, నందికంటి శ్రీధర్ ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా పట్నంను పరామర్శించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలువద్ద హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక కేటీఆర్‌పై కూడా కుట్రలు చేస్తున్నారని, ప్రజలకు ఇబ్బంది తలెత్తినప్పుడు ప్రతిపక్షనేతలుగా ప్రశ్నిస్తే కేసులు పెట్టి ఇరికిస్తారా? రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఎక్కడుందని ప్రశ్నించారు. కొంతకాలంగా లగచర్లలో రైతులు ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వబోమని పోరాటాలు చేస్తున్నారని, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోకపోగా గూండాలు, రాజకీయ నాయకులతో బెదిరింపులకు గురిచేసి అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. లగచర్లలో అక్రమ కేసులకు భయపడి రైతులు ఊరి నుంచి పిల్లపాపలతో తరలిపోతున్నారని అవేదన వ్యక్తంచేశారు. రైతులకు అండగా నిలిచిన పట్నం నరేందర్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేకపోయినా అక్రమ కేసులు బనాయించారని మండిపడ్డారు.ప్రజలకు అన్యాయం జరిగితే పోరాడటం ప్రతిపక్షంగా మా బాధ్యత. మాపై కోపం ఉంటే మమ్మల్ని అరెస్ట్ చేయాలి తప్ప అమాయక గిరిజన రైతులపై కేసులెలా పెడతారు? మాపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపాలని అనుకుంటున్నారు. మాకు జైళ్లు, కేసులు కొత్త కాదు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో కేసులు ఎదుర్కొన్నాం, జైళ్లకు కూడా వెళ్లొచ్చాం.

**ఏం జరిగినా బీఆర్ఎస్‌కు అంటగడ్తరా?**

రాష్ట్రంలో ఎక్కడ ఏ ఉద్యమం జరిగినా, ఎవరు నిరసన వ్యక్తం చేసినా బీఆర్ఎస్ చేయిస్తున్నదని అంటున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. నిరుద్యోగులు, రైతులు, స్పెషల్ పోలీసులు, హాస్టల్ విద్యార్థులు తమ సమస్యలపై స్వచ్ఛందంగా ధర్నా చేస్తే అది బీఆర్ఎస్ చేయించిందని రేవంత్ అంటున్నారని పేర్కొన్నారు. రేవంత్ సొంత నియోజకవర్గంలో తమ భూముల కోసం గిరిజనులు పోరాటం చేస్తే అది కూడా బీఆర్ఎస్ చేసిందనే అంటున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మల్లన్నసాగర్‌లో రేవంత్‌రెడ్డి రెండురోజులపాటు నిరసన చేస్తే తాము ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించామని గుర్తుచేశారు. అర్ధరాత్రి మహిళల చాతీమీద కాళ్లు పెట్టి అరెస్టులు చేయడం సరికాదని హితవు పలికారు. లగచర్లకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు మధుసూదనాచారి, ఆర్ఎస్ ప్రవీణ్, కార్తీక్‌రెడ్డితో పాటు బీజేపీ నాయకురాలు డీకే అరుణను అడ్డుకోవడం సరికాదన్నారు. తననో, కేటీఆర్‌నో, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలనో అరెస్ట్ చేయండి, కానీ గిరిజన రైతులను అరెస్టు చేయడం సరికాదని, అక్రమంగా అరెస్ట్ చేసిన గిరిజన రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నరేందర్‌రెడ్డికి ఈ కేసుతో సంబంధం లేదు. రిమాండ్ రిపోర్ట్‌లో ఏముందో ఆయనకు తెలియదు. మేజిస్ట్రేట్ ముందు తనను హాజరుపరచడానికి ఒక్క నిముషం ముందు తనపై ఒత్తిడి చేసి సంతకం పెట్టించినట్టు నరేందర్‌రెడ్డి నాతో చెప్పారు. కేటీఆర్‌తో పట్నం ఫోన్‌కాల్స్‌పై కాంగ్రెస్ నాయకులు గోబెల్స్ ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.

**భూములు గుంజుకుంటారా!**

పీడిత వర్గాల ప్రజలకు అండగా నిలబడటమే తన బాధ్యత అని హరీశ్ అన్నారు. దేశంలో నాటి ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలన నేడు రాష్ట్రంలో మళ్లీ కనిపిస్తుందని విమర్శించారు. ఇందిరమ్మ ముసుగులో దళితులు, గిరిజనుల భూములు గుంజుకుంటున్నారని, రైతుల భూములు గుంజుకోవడమే ఇందిరమ్మ పాలనా అని నిలదీశారు. తొమ్మిది నెలల గర్భిణి, మహిళల ఛాతీ మీద తొక్కుకుంటూ పోలీసులు ఇంట్లోకి వెళ్లారని, ఇదేనా ప్రజాపాలన అని నిలదీశారు. రేవంత్ సొంత నియోజకవర్గంలో తనకు ఓట్లేసి గెలిపించిన గిరిజనుల భూములను అన్యాయంగా లాక్కుంటున్నారని, ఎదురుతిరిగిన అమాయక ప్రజలపై కేసులు పెట్టి జైలుకు పంపడం ఎంతవరకు కరెక్టని ప్రశ్నించారు.

**మా పాలనలో 14వేల ఎకరాలు సేకరణ**

బీఆర్ఎఎస్ పాలనలో హైదరాబాద్‌లో ఫార్మాసిటీ కోసం కేసీఆర్ 14 వేల ఎకరాలు సేకరించారని ఆ భూముల్లో ఫార్మాసిటీ ఎందుకు పెట్టడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. కొడంగల్‌లో ఫార్మాసిటీ కట్టడం ద్వారా గతంలో తాము సేకరించిన ప్రాంతంలో రియల్ ఎస్టేట్ చేయాలన్న కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. పచ్చటి పొలాల్లో రేవంత్‌రెడ్డి చిచ్చు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్ పాలన కేవలం అదానీ, తన తమ్ముళ్లు, అల్లుళ్లు, బడాబాబుల కోసమేనని విమర్శించారు.

**కేటీఆర్ మీద కుట్ర చేస్తున్నరు**

బీఆర్ఎస్ పార్టీ పేదల పక్షాన నిలబడుతుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రజలకు సమాధానం చెప్పలేక ప్రశ్నించే గొంతుక కేటీఆర్ మీద కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తనను అనవసరంగా ఇరికించారని, కేటీఆర్‌ను కూడా ఇరికించాలని చూస్తున్నారని పట్నం తనతో చెప్పినట్టు తెలిపారు. నరేందర్‌రెడ్డి ధైర్యంగా ఉన్నారని, ఆయనకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ధర్మమే గెలుస్తుందని, నరేందర్‌రెడ్డి నిర్దోషిగా బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రధాని మోదీ వరల్డ్ రికార్డు... ఎందులో అంటే!

1. కింగ్ అబ్దుల్ అజీజ్ సాష్ పురస్కారం- సౌదీ అరేబియా (2016)
2. స్టేట్ ఆర్డర్ ఆఫ్ ఘాజీ అమీర్ అమానుల్లా ఖాన్- ఆఫ్ఘనిస్థాన్ (2016)
3. గ్రాండ్ కాలర్ ఆఫ్ ద స్టేట్ ఆఫ్ పాలస్తీనా అవార్డ్ - పాలస్తీనా (2018)
4. ది ఆర్డర్ ఆఫ్ జాయెద్ అవార్డ్- యూఏఈ (2019)
5. ది ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోస్టల్- రష్యా (2019)
6. ఆర్డర్ ఆఫ్ ది డిస్టింగ్విష్డ్ రూల్ ఆఫ్ నిషాన్ ఇజుద్దీన్- మాల్దీవులు (2019)
7. కింగ్ హమాద్ ఆర్డర్ ఆఫ్ రెనైస్సాన్స్- బహ్రెయిన్ (2019)
8. లెజియన్ ఆఫ్ మెరిట్- అమెరికా (2020)
9. ది ఆర్డర్ ఆఫ్ ది డ్రుక్ గ్యాల్పో- భూటాన్ (2021)
10. ఎబ్కాల్ అవార్డ్- రిపబ్లిక్ ఆఫ్ పలావ్ (2023)
11. ది కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీ- ఫిజీ (2023)
12. గ్రాండ్ కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ లోగోహు- పాపువా న్యూ గినీ (2023)
13. ది ఆర్డర్ ఆఫ్ నైల్- ఈజిప్ట్ (2023)
14. ది గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది లెజియన్ ఆఫ్ ఆనర్- ఫ్రాన్స్ (2023)

## “విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోతే ఊచలు లెక్కించాల్సి వస్తుంది”

“ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. వర్సిటీలకు ఉపకులపతులను నియమించాం. విద్యా వ్యవస్థను బాగు చేసేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశాం. ప్రభుత్వ టీచర్లకు ఉన్న అర్హత ప్రైవేటు ఉపాధ్యాయులకు లేదు. అయినా పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించడానికి ఇష్టపడట్లేదు. ప్రభుత్వ బడుల ప్రతిష్ట పెంచే బాధ్యత టీచర్లదే. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో విద్యార్థులను కలిసి సమస్యలు తెలుసుకోవాలి. నవంబర్ 14 నుంచి డిసెంబర్ 7 వరకు విజయోత్సవాలు నిర్వహిస్తున్నాం. అనుకున్న విధంగా బాలల దినోత్సవం రోజున ఉత్సవాలు ప్రారంభించాం.నాణ్యమైన భోజనం పెట్టకపోతే జైలుకు పంపుతాం అధికారులు జిల్లాల్లో రెండు రోజుల పాటు పాఠశాలలను పర్యవేక్షించాలి. విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలి. హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యంతో మంచి అన్నం పెట్టాలి. దొడ్డు బియ్యం, కుళ్లిన కూరగాయలతో భోజనం పెడితే ఊరుకునేది లేదు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోతే జైలుకు పంపుతాం. గత సీఎంను ఏనాడైనా మీరు (విద్యార్థులను ఉద్దేశించి) చూశారా? మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులను ఏనాడైనా చూశారా? ఈ రోజు మీ రేవంత్ అన్న మీతో చేయి కలిపాడా.. లేదా? దేశానికి ఆదర్శంగా ఉంటామని.. ఎలాంటి చెడు వ్యసనాలకు బానిసలు కాబోమని విద్యార్థులు ప్రమాణం చేయాలి” అని సీఎం కోరారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో వాయుకాలుష్యం... ప్రైమరీ స్కూళ్లు మూసివేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం!

తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు ఇవి కొనసాగుతాయన్నారు.స్టేజ్-3 ఆంక్షల ప్రకారం అత్యవసరం కాని నిర్మాణాలు, కూల్చివేతలపై నిషేధం ఉంటుంది. ఐదో తరగతి వరకు విద్యార్థులకు సెలవులు ఇస్తారు.ఢిల్లీలో వాయుకాలుష్యం ప్రమాదకరస్థాయికి పెరుగుతోంది. రెండు రోజులుగా వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) దాదాపు 400 దాటుతోంది. వాయు కాలుష్యం కట్టడి చర్యల్లో భాగంగా ఢిల్లీ-ఎన్సీఆర్ పరిధిలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్-3ని అమలు చేయనున్నట్లు ప్రకటించింది. శుక్రవారం నుంచి ఇది అమల్లోకి వస్తుందని ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ తెలిపింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసు: పోలీసుల ఎదుట హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఫోరెన్సిక్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) నుంచి తాజా ఆధారాలు వెల్లడైన నేపథ్యంలో, పోలీసులు ఆ కోణంలో చిరుమర్తి లింగయ్యను ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ఈ కేసులో నిందితుడు, ఇప్పటికే సస్పెండైన అదనపు ఎస్పీ మేకల తిరుపతన్న, చిరుమర్తి లింగయ్య మధ్య కీలక సంభాషణలు చోటుచేసుకున్నట్టుగా ఫోరెన్సిక్ ల్యాబ్ పలు అంశాలను నిర్ధారించినట్టు సమాచారం. బీఆర్ఎస్ నేతలు... కొందరు వ్యక్తుల ఫోన్ నెంబర్లను నిందితుడికి పంపించినట్టుగా ఫోరెన్సిక్ నివేదిక పేర్కొంది. కాగా, ఈ కేసులో చార్జిషీటు నమోదు చేసిన సమయంలో అప్పటికింకా ఫోరెన్సిక్ నివేదిక రాలేదు. ఇప్పుడు ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన నేపథ్యంలో, పోలీసుల అభియోగాలకు మరింత బలం చేకూరినట్టయింది. దాంతో, ఈ కేసులో చాలామందికి నోటీసులు పంపేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. చిరుమర్తి లింగయ్యకు కూడా ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగానే నోటీసులు పంపారు.

## మా పిల్లలకు ఉరి శిక్ష వేస్తామని బెదిరిస్తున్నారు.. లగచర్ల బాధితురాలి ఆవేదన ఇదీ..

తమ భూములను లాక్కొవద్దు అని నిరసన తెలుపుతున్న రైతులను, వారి పిల్లలను అరెస్టు చేసి జైళ్లకు పంపిన పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో లగచర్ల బాధితురాలి మాటలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి.తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సమావేశం సందర్భంగా ఓ బాధితురాలు బోరున విలపించారు. మా భర్తతో పాటు మా పిల్లలను పోలీసులు బలవంతంగా తీసుకెళ్లారు. ఇప్పుడు ఏ జైల్లో పెట్టారో కూడా తెలియడం లేదు. మా పెద్ద కొడుక్కి ఉరి శిక్ష వేస్తామని చెప్తున్నారు సార్ అంటూ కేటీఆర్ వద్ద ఆమె కన్నీరు పెట్టుకున్నారు.అధైర్య పడొద్దు.. మీ పిల్లలు, భర్తలను ఇంటికి తీసుకొచ్చే బాధ్యత మాది అని కేటీఆర్ వారికి భరోసానిచ్చారు. కేసీఆర్ తరపున మాట ఇస్తున్నాం. మీ మనువండ్లు, పిల్లలు, భర్తలు ఇంటికి తిరిగి వచ్చే దాకా మేం చూసుకుంటాం. అండగా నిలబడుతాం. ఆందోళన చెందకండి.. కోర్టుకు పోయి కొట్లాడుతామని కేటీఆర్ ధైర్యమిచ్చారు.

## లగచర్ల రైతులు తమ భూములు ఇవ్వమంటున్నా భయపెడుతున్నారు

ఇక మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ అక్కడికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు.. కానీ సీఎం రేవంత్ రెడ్డి సోదరుడిని మాత్రం 50 వాహనాల కాన్వాయ్ తో పంపించారు అని ఈటెల రాజేందర్ చెప్పుకొచ్చారు.అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడిని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ బయటకు వచ్చి లోపలికి తీసుకెళ్లారు.. కానీ, బీజేపీ ఎంపీ డీకే అరుణకు కనీస మర్యాద కూడా ఇవ్వలేదు అని మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ఆరోపించారు. అలాగే, ముచ్చర్లలో 14 వేల ఎకరాల భూమిని బలవంతంగా సేకరించారు.. ఆ భూముల్ని ఫోర్త్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ గా మార్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుంది అని తెలిపారు. రేవంత్ రెడ్డి కళ్ళు నెత్తికెక్కాయని ఈటెల రాజేందర్ మండిపడ్డారు.




# విశ్వంభర ఎఫెక్ట్.. అఖిల్ సినిమా ఇంకా ఆలస్యం?

యువి క్రియేషన్స్ సంస్థ ప్రభాస్ సన్నిహితులు స్నేహితులు కలిసి ప్రారంభించారు. మొదట్లో ఈ సంస్థకి వరుస హిట్స్ వచ్చినా, ఇప్పుడు చేసిన దాదాపు అన్ని సినిమాలు ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి.ఒకరకంగా ఈ సంస్థ మీద ఇప్పుడు ఫైనాన్షియల్ ప్రెజర్ ఉంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పుడు ఈ సంస్థ నుంచి చిరంజీవి హీరోగా విశ్వంభరా అనే సినిమా వస్తోంది. ఈ సినిమా కోసం గట్టిగానే ఖర్చుపెట్టారు. వశిష్ట దర్శకత్వంలో ఈ చిత్రం కోసం దర్శకుడి రేంజ్ కంటే మించి ఖర్చుపెట్టినట్టు తెలుస్తోంది. సినిమా సంక్రాంతికి రావాలి కానీ మెగాస్టార్ చిరంజీవి కుమారుడు రామ్ చరణ్ సినిమా కోసం సంక్రాంతి సీజన్ వదిలేసుకుని వెనక్కి వెళ్లారు. మా సినిమా రెడీ గానే ఉంది కానీ చరణ్ బాబు కోసం వెనక్కి వెళ్ళాము అని ప్రకటించారు. అయితే ఈ సినిమా వాయిదా ప్రకటన చేశారు కానీ దానివల్ల మరో సినిమా మీద ప్రెజర్ పడినట్లు తెలుస్తోంది.అదేంటంటే ఈ సినిమా మీద భారీగా పెట్టుబడులన్నీ పెట్టిన నేపథ్యంలో ఈ ప్రొడక్షన్ నుంచి రావాల్సిన మరో సినిమా కాస్త ఆలస్యం అవుతుంది. విశ్వంభర సినిమా ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగితే ఆ తర్వాత అఖిల్- అనిల్ సినిమా పట్టాలెక్కించే అవకాశం ఉంది. మామూలుగా అయితే ఇప్పటికే సినిమా పట్టాలు ఎక్కాలి కానీ విశ్వంభర కారణంగా సినిమా వాయిదా పడింది.. వచ్చే ఏడాది ఈ సినిమాను సెట్స్ మీదకు తీసుకెళ్లే అవకాశం కనిపిస్తోంది. 2025 మధ్యలో సినిమాని సెట్స్ మీదకు తీసుకు వెళ్లే అవకాశం ఉంది. ఈలోపే మురళీ శంకర్ దర్శకత్వంలో ఒక సినిమా మొదలుపెట్టబోతున్నారు. ఈ సినిమా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ మీద నాగార్జున నిర్మించబోతున్నారు. మొత్తం మీద మెగాస్టార్ చిరంజీవి సినిమా కారణంగా అఖిల్ సినిమా కాస్త వెనక్కి వెళ్లడం ఇప్పుడు టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతుంది.

# అమెజాన్‌లో ‘సిటడెల్: హనీ బన్నీ’ హవా..

## జాన్వీకపూర్ పోస్ట్‌కు స్పందించిన సమంత





సమంత, వరుణ్ ధావన్ నటించిన వెబ్ సిరీస్ ‘సిటడెల్: హనీ బన్నీ’. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సిరీస్ మంచి ఆదరణను సొంతం చేసుకుంది.దీంతో విడుదలైన నాటి నుంచి అమెజాన్‌లో ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. తాజాగా ఈ సిరీస్ ఓ ఘనతను సొంతం చేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధికమంది వీక్షించిన సిరీస్‌గా నిలిచింది.రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించిన ఈ సిరీస్ ప్రపంచవ్యాప్తంగా 200 దేశాల్లో ప్రసారమవుతోంది. భారత్‌తో పాటు అమెరికా, ఇటలీ, ఆస్ట్రేలియా, కెనడా, బ్రెజిల్‌తో సహ మొత్తం 150 దేశాల్లో ‘సిటడెల్: హనీ బన్నీ’ టాప్‌లో ఉంది. దీని గురించి దర్శకులు మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్ పూర్తిచేయడం ఓ సవాలుగా అనిపించిందన్నారు. దీనికి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభించడం ఆనందంగా ఉందని. దీనివెనక ఎంతోమంది కృషి ఉందని తెలిపారు.ఇక ఈ సిరీస్ విడుదలైన నాటినుంచి సినీ ప్రముఖులు దీనిపై ప్రశంసలు కురిపిస్తూనే ఉన్నారు. తాజాగా బాలీవుడ్ నటి జాన్వీకపూర్ దీనిని ప్రశంసించారు. ‘ప్రపంచవ్యాప్తంగా సిటడెల్ తుపాను ఏర్పడింది. దీనికి వస్తోన్న ఆదరణ చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది. మీ కష్టానికి తగిన ప్రతిఫలం లభించింది’ అని అన్నారు. ఈ పోస్ట్‌ను సమంత షేర్ చేసి థ్యాంక్స్ చెప్పారు. మరోవైపు దీని పార్ట్2 కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రెండో భాగాన్ని సినిమాగా తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. ప్రస్తుతం ఇది చర్చల దశలో ఉంది. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు.

# ఓటీటీలోకి దుల్కర్ సల్మాన్ 100 కోట్ల సినిమా.. లక్కీ భాస్కర్ స్ట్రీమింగ్ ఎప్పుడంటే?



మహానటి, సీతారామం తర్వాత దుల్కర్ సల్మాన్ తెలుగులో నటించిన మరో లక్కీ భాస్కర్. వెంకీ అట్లూరి తెరకెక్కించిన ఈలో మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటించింది.దీపావళి కానుకగా అక్టోబర్ 31న విడుదలైన ఈ బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళ్, మలయాళ భాషల్లోనూ ఈ కు భారీ వసూలు వచ్చాయి. అంతేకాదు లక్కీ భాస్కర్ తో మొదటి సారి 100 కోట్ల క్లబ్ లో చేరాడు దుల్కర్ సల్మాన్. అమరన్, క, బఘీరా లాంటి లు పోటీలో ఉన్నా లక్కీ భాస్కర్ కు భారీ వసూళ్లు వచ్చాయి. ఇప్పటికీ చాలా చోట్ల థియేటర్లలో దుల్కర్ సల్మాన్ రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో లక్కీ భాస్కర్ ఓటీటీ రిలీజ్ కు సంబంధించి ఒక ఆసక్తికర వార్త వినిపిస్తోంది. ఈ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. ఇందుకోసం 30 కోట్లకు పైగానే డీల్ జరిగినట్లు తెలుస్తోంది. డీల్ ప్రకారం నెల రోజుల తర్వాత నే లక్కీ భాస్కర్ ను స్ట్రీమింగ్ కు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. అంటే నవంబర్ 30న లేదా ఆతర్వాతి తేదీల్లో దుల్కర్ సల్మాన్ స్ట్రీమింగ్ కు అందుబాటులోకి రానుందన్నమాట. త్వరలోనే లక్కీ భాస్కర్ ఓటీటీ రిలీజ్ పై అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు సమాచారం.నాగ వంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ స్ బ్యానర్లపై లక్కీ భాస్కర్ ను తెరకెక్కించారు. రాంకీ, సూర్య శ్రీనివాస్, మానస చౌదరి, సచిన్ ఖేడ్కర్, టినూ ఆనంద్, కసిరెడ్డి, హైపర్ ఆది తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్ అందించాడు.

# ప్రభాస్ ఫ్యాన్స్‌కు పండగే.. స్పిరిట్ గురించి అద్దిరిపోయే న్యూస్..




పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ చేతిలో ఇప్పుడు చాలా లున్నాయి. బాహుబలికి ముందు ఏడాదికి ఒక అనే నిబంధన ఉండేది ప్రభాస్కి. ఈ విషయం ఆయన ఫిల్మోగ్రఫీ చూస్తే తెలుస్తుంది.దీంతో ప్రభాస్ ఏడాదికి ఒకే లో నటించేవాడు. అయితే ఇప్పుడు డిమాండ్ పెరగడంతో ప్రభాస్ ఆ రూల్ ని బ్రేక్ చేసి ఏడాదికి రెండు మూడు ల్లో నటిస్తున్నాడు. గతేడాది ప్రభాస్ నటించిన రెండు లు విడుదలయ్యాయి. వచ్చే ఏడాది మూడు లు విడుదల కానున్నాయి. ఇప్పుడు డిసెంబర్ లో ప్రభాస్ కొత్త స్టార్ట్ చేస్తున్నాడు. ప్రభాస్ ప్రస్తుతం ‘రాజా సాబ్’ షూటింగ్ దాదాపు పూర్తి చేసుకున్నాడు. దీని పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇక ‘సీతా రామం’ ఫేమ్ రఘు హనుపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న కొత్త లాంచ్ గత నెలలో జరగగా, షూటింగ్ కూడా మొదలైంది. ఆ షూటింగ్ పూర్తి కాకముందే ప్రభాస్ మరో కొత్త స్టార్ట్ చేస్తున్నాడు. ‘అర్జున్‌రెడ్డి’, ‘యానిమల్’ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ‘స్పిరిట్’ చిత్రంలో ప్రభాస్ నటించనున్న ఈ షూటింగ్ డిసెంబర్‌లో ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాత భూషణ్ కుమార్ ధృవీకరించారు. డిసెంబరులో ముహూర్తాన్ని చిత్రీకరించబోతున్నామని, ఆ తర్వాత కాస్త సమయం తీసుకుని షూటింగ్ ప్రారంభించబోతున్నామని చెప్పారు. 2026లో ఈ విడుదల కానుంది.‘స్పిరిట్’ నిజాయితీ గల పోలీస్ ఆఫీసర్ కథ అని సందీప్ రెడ్డి వంగా గతంలో చెప్పారు. హీరోలకు భారీ ఎలివేషన్స్ ఇవ్వడంలో ప్రముఖంగా పేరుగాంచిన సందీప్ రెడ్డి వంగా తన ల హీరో కంటే ఎక్కువ పాపులర్ పర్సనాలిటీ సొంతం చేసుకున్నాడు. మరి అలాంటి సందీప్ రెడ్డి ప్రభాస్ కోసం ఎలాంటి కథను రాసుకున్నాడో, ఎలా తెరకెక్కిస్తాడోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఫస్టాఫ్ అద్భుతం.. సెకండాఫ్ అంతకు మించి ఉంటుంది: రష్మిక

బాక్సాఫీస్ వద్ద ‘పుష్ప’ రూల్‌కు సమయం దగ్గరవుతోంది. దాదాపు 21 రోజుల్లో ‘పుష్ప ది రూల్’ విడుదల కానుంది.ఈ నేపథ్యంలోనే ‘పుష్ప 2’ షూట్‌కు సంబంధించి నటి రష్మిక ఆసక్తికర అప్‌డేట్ ఇచ్చారు. చిత్రీకరణ ఆద్యంతం చాలా సరదా జరిగిందని చెప్పిన ఆమె.. షూట్ చివరి దశకు చేరుకుందని తెలిపారు. డబ్బింగ్ పనులుజరుగుతున్నాయని చెప్పారు. డబ్బింగ్ స్టూడియోలో దిగిన ఫొటోని షేర్ చేశారు.”ఫన్, గేమ్స్ ఇక పూర్తయ్యాయి. పనిలో బిజీ అయ్యా..! ‘పుష్ప ది రూల్’ చిత్రీకరణ దాదాపు పూర్తి అయింది. ఫస్టాఫ్ డబ్బింగ్ పనులు కూడా పూర్తి చేశా. సెకండాఫ్ కోసం డబ్బింగ్ చెబుతున్నా. మై గాడ్.. ఫస్టాఫ్ అద్భుతంగా ఉంది. సెకండాఫ్ అంతకు మించి ఉంటుంది. మాటల్లో చెప్పలేకపోతున్నా. మీరు తప్పకుండా మైండ్ బ్లోయింగ్ అనుభూతిని పొందనున్నారు. ఈ చిత్రాన్ని మీకు చూపించేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నా. షూట్ పూర్తి అవుతున్నందుకు బాధగా ఉంది” అని రష్మిక చెప్పారు.2021లో విడుదలైన ‘పుష్ప ది రైజ్’కు కొనసాగింపుగా ఇది సిద్ధమవుతోన్న విషయం తెలిసిందే. అల్లు అర్జున్ – సుకుమార్ కాంబినేషన్‌లో ఇది తెరకెక్కుతోంది. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై ఇది నిర్మితమవుతోంది. ఎర్ర చందనం స్మగ్లింగ్ నేపథ్యంలో రానున్న ఈ సినిమాలో పుష్పరాజ్‌గా అల్లు అర్జున్, శ్రీవల్లిగా రష్మిక కనిపించనున్నారు. పార్ట్ 1లో ప్రేమికులుగా వీరిద్దరూ కనిపించారు. ‘పుష్ప 2’లో భార్యాభర్తలుగా కనిపించనున్నారు. గత చిత్రంలో స్పెషల్ సాంగ్ కోసం సమంత కనిపించగా.. సీక్వెల్‌లో ఐటమ్ సాంగ్‌కు శ్రీలీల డ్యాన్స్ చేయనున్నారు. ఫైనల్ కట్ పూర్తైందని దాదాపు మూడు గంటల నిడివి ఉందని సమాచారం. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచేశాయి. ప్రపంచవ్యాప్తంగా 11,500 స్క్రీన్స్‌లో విడుదల చేయనున్నట్లు ఇప్పటికే టీమ్ ప్రకటించింది. ఇండియాలో 6,500.. ఓవర్సీస్‌లో 5,000 స్క్రీన్స్‌లో దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపారు.



# భారత్ జోరు.. రఫ్ఫాడించిన మహిళా ఆటగాళ్లు



మహిళల హాకీ ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ వరుసగా మూడో విజయాన్ని సాధించింది. గురువారం బీహార్‌లోని రాజ్‌గిర్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల హాకీ జట్టు 13–0తో థాయ్‌లాండ్‌ను ఓడించింది. భారత్ తరఫున దీపికా కుమారి 5 గోల్స్ చేసింది. దీంతో.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైంది. దక్షిణ కొరియాతో జరిగిన చివరి మ్యాచ్‌లోనూ దీపిక రాణించింది. ఆ మ్యాచ్ లోనూ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైంది. భారత్ తరఫున లాల్‌రెమ్సియామి దేవి, ప్రీతి దూబే, మనీషా చౌహాన్ చెరో 2 గోల్స్ చేశారు. ఈ టోర్నీలో భారత్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది.చైనా కూడా ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది. నవంబర్ 14న జరిగిన మూడో మ్యాచ్‌లో చైనా 2–1తో జపాన్‌ను ఓడించింది. భారత్‌తో పోలిస్తే చైనా గోల్ తేడా చాలా ఎక్కువగా ఉంది. నవంబర్ 12 వరకు చైనా గోల్ తేడా 20 కాగా, ఇప్పుడు 21కి పెరిగింది. ఆసియా మహిళల హాకీ ఛాంపియన్స్ ట్రోఫీలో చైనా పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగడానికి ఇదే కారణం.కాగా.. భారత్ ఇంకా 2 మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా.. దాదాపు సెమీఫైనల్‌కు చేరుకుంది. భారత్ తదుపరి మ్యాచ్ 16న చైనాతో జరగనుంది. ఆ మ్యాచ్ కూడా భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4:45 గంటలకు ప్రారంభమవుతుంది. భారత్ వర్సెస్ థాయ్‌లాండ్ మ్యాచ్‌కు ముందు మలేషియా 2–1తో దక్షిణ కొరియాపై విజయం సాధించింది. అంతకు ముందు చైనా తొలి మ్యాచ్‌లో జపాన్‌ను ఓడించింది.

# ఆస్ట్రేలియా ఏ ప్లాన్ వేస్తుందో విరాట్ కోహ్లీకి ముందే తెలుసు: సంజయ్ మంజ్రేకర్



నవంబర్ 22 నుంచి ఆస్ట్రేలియా, భారత్ మధ్య బోర్డర్–గావస్కర్ ట్రోఫీ సిరీస్ ప్రారంభంకానుంది. ఇప్పటికే భారత జట్టు ఆస్ట్రేలియాకు చేరుకుని ప్రాక్టీస్‌లో నిమగ్నమైంది.గత కొంతకాలంగా పేలవమైన ఫామ్ ప్రదర్శిస్తున్న స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ .. కంగారులపై చెలరేగి ఆడాలకుంటున్నాడు. అయితే, విరాట్‌ను కట్టడి చేయడానికి ఆసీస్ వ్యూహాలు రచిస్తోంది. ఈ నేపథ్యంలో భారత మాజీ ఆటగాడు సంజయ్ మంజ్రేకర్ కోహ్లీ గురించి మాట్లాడాడు. ఈ సిరీస్‌లో తన కోసం ఆస్ట్రేలియా ఎలాంటి ప్లాన్ వేస్తుందో విరాట్‌కి ముందే తెలుసని పేర్కొన్నాడు.”ఆస్ట్రేలియా వాళ్లు తన కోసం ఏం ప్లాన్ చేయబోతున్నారో విరాట్‌కు తెలుసు. ఆసీస్ బౌలర్లు కచ్చితంగా ఆరంభంలో ఆఫ్ స్టంప్ వెలుపల ఉన్న లైన్‌లో బౌలింగ్ చేసి ఏ మూడ్‌లో ఉన్నాడో అంచనా వేస్తారు. సాధారణంగా కోహ్లీ ఆఫ్ స్టంప్ వెలుపల వచ్చే బంతులను వదిలివేయాలని చూస్తాడు. ఒకవేళ బంతి సరైన ప్రదేశంలో పడితే డ్రైవ్ చేయడానికి చూస్తాడు. ఇటీవల కాలంలో బౌలర్లు కోహ్లీని ఇరుకున పెట్టడానికి అతని శరీరాన్ని లక్ష్యంగా చేసుకోని బౌనర్లు కూడా సంధిస్తున్నారు. ఎందుకంటే విరాట్ ముందుకు వచ్చి ఆడటానికి ఇష్టపడతాడు. న్యూజిలాండ్ ఇలా చేయడానికి ప్రయత్నించింది. ఇది చాలా తెలివైన పనే. అయితే, ఆస్ట్రేలియా బౌలర్లు ప్రయత్నించే వ్యూహాలన్నింటి గురించి కోహ్లీకి తెలుసు’ అని మంజ్రేకర్ వివరించాడు. తొలి టెస్టు పెర్త్ వేదికగా జరగనుంది.

# ‘అర్ష్‌దీప్ మ్యాచ్‌లోని అన్ని దశల్లోనూ బౌలింగ్ చేయగల సమర్థుడు’



టీమ్‌ఇండియా పేసర్ అర్ష్‌దీప్ సింగ్ పై మాజీ వికెట్‌కీపర్ పార్థివ్ పటేల్ ప్రశంసలు కురిపించాడు.మ్యాచ్‌లో అన్ని దశల్లోనూ బౌలింగ్ చేయగల సమర్థుడని పేర్కొన్నాడు. సౌతాఫ్రికా తో జరిగిన మూడో టీ20లో అర్ష్‌దీప్ (3/37) సత్తాచాటాడు. తొలుత రికెల్‌టన్ (20)ను ఔట్ చేసిన అతడు.. కీలకమైన 18 ఓవర్‌లో దూకుడుగా ఆడుతున్న క్లాసెన్ (41)ను పెవిలియన్‌కు పంపడంతోపాటు 8 పరుగులు మాత్రమే ఇచ్చి భారత్‌కు ఊరటనిచ్చాడు. ఆఖరి ఓవర్‌లో సౌతాఫ్రికా విజయానికి 25 పరుగులు అవసరమైన దశలో బంతిని అందుకున్న అర్ష్‌దీప్.. సిక్సర్లతో చెలరేగుతున్న యాన్సెన్ (54బీ 17 బంతుల్లో)ను ఔట్ చేశాడు. రెండో బంతికి సిక్స్ ఇచ్చినా.. మూడో బంతికి యాన్సెన్ ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. దీంతో భారత్ 11 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌లో 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది.”అతను (అర్ష్‌దీప్) నిజానికి మ్యాచ్‌లో అన్ని దశల్లోనూ బాగా బౌలింగ్ చేయగలడు. అతను కొత్త బంతితో బౌలింగ్ చేయడం చూశాం. డెత్ ఓవర్లలో బౌలింగ్‌ను మెరుగుపరుచుకున్నాడు. యార్కర్లు సంధించడంలో వైవిధ్యం ప్రదర్శిస్తున్నాడు. అంతేకాకుండా నకుల్ బాల్స్, మంచి బౌన్సర్‌లు వేస్తాడు. చాలా మంది బౌలర్లు వేరియేషన్స్‌ను కలిగి ఉంటారు. కానీ, అర్ష్‌దీప్ తన వేరియేషన్స్‌ను సరైన సమయంలో ఉపయోగిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నాడు. అతను ఆటను అర్థం చేసుకుంటాడు. బ్యాటర్ల బలమేంటి, ఎక్కడ ఫీల్డర్లు మోహరించాలో అర్ష్‌దీప్‌కు తెలుసు. కొన్నిసార్లు పరుగులు సమర్పించుకోవచ్చు. కానీ, ఒత్తిడిని తట్టుకుంటూ బ్యాటర్లను ఇబ్బందిపెట్టేలా కఠినమైన బంతులు వేయడం, ప్రశాంతంగా ఉండటం అర్ష్‌దీప్ బలం అని నేను నమ్ముతున్నా” అని పార్థివ్ పటేల్ వివరించాడు. టీ20ల్లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు (92) పడగొట్టిన ఫాస్ట్‌బౌలర్ అర్ష్‌దీపే. ఈ పేసర్ మరో నాలుగు వికెట్లు పడగొడితే యుజ్వేంద్ర చాహల్ (96)ను అధిగమించి పొట్టి ఫార్మాట్‌లో ఎక్కువ వికెట్లు తీసిన భారత ఆటగాడిగా నిలుస్తాడు.






తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక
జిల్లా అనుబంధం
|| శుక్రవారం 15 నవంబర్ - 2024 || పేజీలు : 4


# స్ఫూర్తి

## కొన్ని మాటలు

**యుద్ధానికి బీజం వేసేది మాటలే**
**- శాంతి చర్చలకు నాంది పలికేది మాటలే**

కొన్ని మాటలు కొన్ని మస్తిష్క మనోఫలకంపై
కొత్త ఆలోచనావిష్కరనలకు పురుడు పోసి
నాందిపల్కుతాయి
కొన్ని మాటలు జుంటితేనెల వూటలు
జ్ఞన మేదోమదనపు బాటలు
కొన్ని మాటలు
మాడిన డొక్కలకు,ఎండిన గొంతుకలకు
తడి చెమ్మ
కొన్ని మాటలు నిరాశ,నిర్వేదాల
చీకటి బతుకులకు
తొలిపొద్దు వెలుగు దివిటి
కొన్ని మాటలు అయిటి ఆశల విత్తులకు
చినుకై రాలి ఊపిరి పోస్తది రైతుకు
చేయూతనిస్తది
కొన్ని మాటలు కులకంచెల హద్దులు చెరిపి
చెలిమికి జీవం పోస్తది స్నేహానికి ప్రాణమిస్తది
మాటలు కొన్ని కూడిన జతలో కుంపటి పెడతది
సతుల,హితుల దూరంజేసి లోకంలో
ఏకాకిని జేస్తది
కొన్ని మాటలు ఈటెలై గుండెల్లో గుచ్చుకొని
మానని గాయాలు రేపగలవు
తూటాలై పేలి వూపిరి తీయగలవు సుతిమెత్తని
లేపనమై
మది గాయాలను మాన్పగలవు
మాటలు నానుడి మూటలు అమ్మవొడి
జోలపాటలు
విజ్ఞాన కోటలు
యుద్ధానికి బీజం వేసేది మాటలే..
శాంతిచర్చలకు నాంది పలికేది మాటలే
దిశానిర్దేశం చేసేవి మాటలే
మాటలు మనసు దోస్తాయి మాటలే గోతులు తవ్వి
హృదిని కాటేస్తాయి
మాటలు అనర్దానికి హేతువు అనంత
జ్ఞానానికి సేతువు

- డా. భూతం ముత్యాలు రచయిత
-ఎమ్.పి.యూ.పి.ఎస్. కొండాపురం
ప్రధానోపాధ్యాయులు

# షెడ్యూల్డ్ కులాల వారికి సంక్షేమ పథకాలు సకాలంలో అందించాలి

## - జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్.

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 14 :** గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం సమావేశం మందిరంలో జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యులు వడ్డే పల్లి రాంచందర్ జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ లతో కలిసి జిల్లా అధికారులు పోలీసు అధికారులతో షెడ్యూల్డ్ కులాలకు వివిధ పథకాల అమలు తీరుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు పోస్టుమెట్రిక్స్ స్కాలర్షిప్లు ఏ మేరకు అందుతున్నాయని, అదే విధంగా ఎస్సీ జూనియర్ అడ్వకేట్లకు ప్రోత్సాహకాలు అందుతున్నాయో తెలపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఎస్సీ కాలనీలలో రోడ్ల నిర్మాణాలకు ఎంజిఎన్ఆర్ స్కీం ద్వారా ఎన్ని నిధులు విడుదలైనాయి విడుదలైన నిధుల ద్వారా ఎన్ని కాలనీలలో రోడ్ల నిర్మాణాలు చేపట్టిన వివరాలను సంబంధిత అధికారులను కమిషన్ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. చిన్న మధ్య తరగతి పరిశ్రమలలో ఎస్సీ కులాల వారికి సబ్సిడీలు యూనిట్ల



వివరాలను తెలుపమని అందుకు సంబంధించిన నివేదికను అందజేయాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారిని ఆదేశించారు ఎస్సి కులాలకు ఇచ్చిన భూముల పరిరక్షణలో రెవెన్యూ శాఖ దృష్టి పెట్టాలని పోలీస్ శాఖ వారు ఎస్సీ ఎస్టీ అత్యాచారాలు వారి పట్ల ఎవరైనా కేసులు నమోదు చేస్తే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే సంక్షేమ పథకాలను ఆయా శాఖలు సకాలంలో ఖర్చుచేసి షెడ్యూల్డ్ కులాల వారి సంక్షేమానికి అన్ని శాఖలు కృషి చేయాలని తెలియజేశారు. ముందుగా కలెక్టరేట్ కు చేరుకున్న జాతీయ షెడ్యూల్డ్ కులాలు కమీషన్ సభ్యులు



వి.రాంచందర్ కలెక్టరేట్ ఆవరణలో మొక్కను నాటారు. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి అన్ని విధాల తోడ్పాటును అందిస్తామని, ఎక్కడ ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లాకు వచ్చి సమీక్ష నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రతిమసింగ్ జాతీయ కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు మహేశ్వరం డిసిపి సునీత ఎల్బీనగర్ డిసిపి జిల్లా అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సన్ షైన్ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు

## - బాలల దినోత్సవం సందర్భంగా ఫుడ్ కార్నివాల్ ఘనంగా నిర్వహించిన - కరెస్పాండెన్స్ కోడి వెంకన్న




**చండూర్ నవంబర్ 14 (శాసనసభ న్యూస్):** భారత మొదటి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం చండూర్ సన్ షైన్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నెహ్రూ చిత్రపటానికి పూలమాలను అలంకరించి ఘనంగా నిర్వహించారు. పౌష్టికాహార లోపం వల్ల చిన్నారులలో ఎదుగుదల తక్కువగా ఉండడం మొదలగు వాటి గురించి తెలియజేస్తూ బాలల దినోత్సవం సందర్భంగా పౌష్టిక ఆహారం గురించి తెలియజేయడం కొరకు పాఠశాలలో విద్యార్థుల చేత చేయించిన వంటల గురించి వివరిస్తూ వాటిని ఏ విధంగా ఎంత మోతాదులో స్వీకరించాలో తెలియజేస్తూ ఫుడ్ కార్నివాల్ని ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా పాఠశాలలో నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ షోలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. సాంస్కృతి కార్యక్రమాల లో భాగంగా చిన్నారులు నృత్య ప్రదర్శనల ద్వారా విద్యార్థులను అలరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కోడి వెంకన్న మాట్లాడుతూ నెహ్రూ కు పిల్లలు అంటే ఎంతో ఇష్టమని అందుకే వారి జయంతి సందర్భంగా బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఇందులో భాగంగా



ఈరోజు నిర్వహించినటువంటి ఫుడ్ కార్నివాల్ ద్వారా పిల్లల్లో పౌష్టిక ఆహారం గురించి తెలియజేయడం చాలా ఆనందాన్ని కలిగించిందని తెలియజేశారు. ఫాన్సీ డ్రెస్ షోలో అలరించిన విద్యార్థులను, నృత్య ప్రదర్శన ద్వారా అలరించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కోడి సుష్మ, రవికాంత్, లతీఫ్ పాషా, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



**చండూర్ నవంబర్ 14 (శాసనసభ న్యూస్) :** నల్గొండ జిల్లా మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి గ్రామం లో అంగన్వాడీ కేంద్రం లో ఘనంగా బాలల దినోత్సవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి , విద్యార్దిని, విద్యార్థులు పాల్గొన్నారు

## ఎలిమినేడు గ్రామానికి 28 వీధిలైట్లు మంజూరు




**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 14 :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామానికి గురువారం రోజున ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి చొరవతో ఊరికి 28 వీధిలైట్లు ఇప్పియడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో వీధిలైట్లను గురువారం అమర్చడం జరిగింది. ఎంపీ, ఎమ్మెల్యేలకు గ్రామ శాఖ ఆధ్వర్యంలో ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్టల యాదగిరి, సీనియర్ నాయకులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ ఆడిన మంత్రి దామోదర రాజనర్సింహా



**హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లా అందోలులోని గురుకుల పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగిన టెన్త్ జోనల్ లెవల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ గురువారం ముగిశాయి.ముగింపు వేడుకలకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై ముగింపు వేడుకలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో పాటు కబడ్డీ ఆడి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు





**చండూర్ నవంబర్ 14 (శాసనసభ న్యూస్):** విద్యార్థులు ఉన్నత ఆదర్శాలతో ఎదగాలి మండల విద్యాశాఖ అధికారి జె.అమృతా దేవి బాలల దినోత్సవం ను జడ్.పి.హెచ్.ఎస్ గట్టుప్పల్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులకు ఆటల పోటీలు సాంస్కృతిక పోటీలు నిర్వహించడం జరిగింది. అలాగే పాఠశాలలో అత్యున్నత హాజరు కలిగిన విద్యార్థుల యొక్క తల్లిదండ్రులను ఘనంగా సన్మానించడం జరిగింది. అత్యున్నత హాజరు కలిగిన విద్యార్థులకు కూడా బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా అమృతా దేవి మాట్లాడుతూ విద్యార్థులు జవహర్లాల్ నెహ్రూ యొక్క స్ఫూర్తితో ఉన్నత స్థాయి కి ఎదగాలని కోరుకున్నారు. బాల్యం ఎంతో అమూల్యమైందని, విద్యార్థు లు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ బాల్యాన్ని ఆస్వాదించాలని, సద్వినియోగపర్చుకోవాలని తెలియజేశారు.

# పిల్లలు శ్రద్ధగా చదివి వృద్ధిలోకి రావాలి

- పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు
- తట్టి అన్నారం కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి
- నేటి విద్యార్థులే...రేపటి భావిభారత నిర్మాతలు
- విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి
- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండల్ రెడ్డి
- తట్టి అన్నారం ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు



**ఆదిభట్ల / శాసనసభ న్యూస్ ప్రతినిధి (, నవంబర్ 14 ) :** విద్యార్థులు శ్రద్ధగా చదివి వృద్ధిలోకి రావాలని కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పరిధిలోని 16 వ వార్డు తట్టి అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం, స్వయం పరిపాలన వేడుకలు నిర్వహించారు. ముందుగా జవహర్ లాల్ నెహ్రూ యొక్క చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ బాలల దినోత్సవ వేడుకల్లో స్థానిక కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ...విద్యార్థులు విద్యార్థి దశ నుంచే కష్టపడి బాగా చదివి, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని అన్నారు. విద్యార్థులు స్వతంత్ర సమరయోధులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. దేశ అభివృద్ధికై విద్యార్థుల పాత్ర ముఖ్యమని విద్యార్థులు ఆ దిశగా దేశ అభివృద్ధికి మంచి నిర్మాణాత్మకమైన ఆలోచనతో ముందుకు సాగాలన్నారు. ఉన్నతమైన దేశ నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు. క్రమశిక్షణ,పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చునని అన్నారు. చెడు అలవాట్లకు లోనుకాకుండ సంస్కారంతో కూడిన విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. పసి పిల్లలు దేవునితో సమానం అని, వాళ్ళ హృదయాలు స్వచ్ఛమైనవని, కల్లా కపటం తెలియని నిష్కల్మషమైనవని అన్నారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యా యులు కొండల్ రెడ్డి మాట్లాడుతూ... నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులని అన్నారు. పాఠశాలలో విద్యతో పాటు అనేక సాంస్కృతిక



కార్యక్రమాలు,ఆటలపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల మానసిక ఎదుగుదలను బేరీజు వేస్తున్నామన్నారు. కేవలం బట్టి చదువులకే పరిమితం కాకుండా వారి ఆసక్తులను బట్టి విద్యాభోదన కొనసాగి స్తున్నామన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలలే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. కేవలం ఉపాధ్యాయులుగానే కాకుండా ఎంఈఓ, డిఈఓ, కలెక్టర్ గా మారి ఎంత ఉత్సాహంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులకు కౌన్సిలర్ గీత వేణుగోపాల్ రెడ్డి మెమొంటోలను, గులాబీ మొక్కలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.కొండల్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చాచాజి పుట్టిన రోజు - పిల్లలకు పండుగ రోజు






**చండూర్ నవంబర్ 14 (శాసనసభ న్యూస్) :** ఘట్టుపాల్ మండల పరిధిలోని కాలురాం ఘుర్కా విద్యాదాయిని విద్యాలయం పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నవంబర్ 14 న బాలల దినోత్సవం గా జరుపుకుంటున్నాము. ఈరోజు చాచా నెహ్రూ అని బాలలంతా ప్రేమగా పిలుచుకునే.. భారత దేశ ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రు పుట్టిన రోజు ఆయనకు పిల్లలు అంటే మహా ఇష్టం. నేటి బాలలే రేపటి భవిష్యత్తు అని అనేవారు. రేపటి దేశ పురోగతికి నేటి బాలలే పాటుపడతారని ఆయన బలంగా నమ్మారు. ఈ సందర్భంగా నెహ్రూ పుట్టిన రోజైన నవంబర్ 14 ను బాలల దినోత్సవం గా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈరోజు పిల్లలకు ప్రత్యేకమైన రోజు బాలల దినోత్సవ నాడు పాఠశాలలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తాయి. పిల్లలు వివిధ వేషధారణల దుస్తులు ధరించి, వారసత్వాన్ని గుర్తు చేసుకుంటారు, వ్యాస రచన పోటీలు, నృత్యాలు, ఆట పాటలు, చిత్ర లేఖనం, వివిధ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మామిడి రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

- మామిడి సీజన్ లో మార్కెట్ కి వచ్చే ప్రతి రైతుకి కనీస వసతులు కలిపిస్తాం
- మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి వెల్లడి.

**ఇబ్రహీంపట్నం,శాసన సభ ప్రతినిధి (పి. వెంకటేష్ ) :** వచ్చే మామిడి సీజన్లో మార్కెట్ కి వచ్చే ప్రతి రైతుకి సమస్యలు లేకుండా చూస్తామని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ చిలుక మధు-సూదన్ రెడ్డి తెలియచేశారు. గురువారం బాటసింగారం పండ్ల మార్కెట్ కి నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మామిడి రైతులు విచ్చేసి సీజన్ లో వారు ఎదుర్కొనే సమస్యలను చైర్మన్ కు విన్నవించడం జరిగింది. పాలకవర్గం పై అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని చిలుక మధుసూదన్ రెడ్డి హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్ .శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# కురుమేడు ఎంపీపీ ఎస్ లో
# ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

- ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రచార కార్యదర్శి కురుమేటి వెంకటరమణ.

**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 14 :** కురుమేడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు కుర్మేటి వెంకటరమణ బాలల దినోత్సవం సందర్భంగా గురువారం నాడు విద్యార్థినీ, విద్యార్థులకు టై, బెల్టు, ఐడి కార్డులను, పంపిణీ చేశారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలలో స్థిరపడి దేశానికి సేవ చేయాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాలకు నా సాయ శక్తులా కృషి ఎప్పుడు ఉంటుందని ఆయన తెలిపారు. మన తొలి ప్రధాని నెహ్రూకు పిల్లలు అంటే చాలా ఇష్టమని, పిల్లలతో ఎక్కువ సమయం గడిపేవారని, అన్నారు. దేశ భవిషత్తు తరగతిగదిలోనే నిర్మితం అవుతుందని తెలియజేసి విద్యార్థులకు బాలల



దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కందుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయురాలు రెబ్బ శశికళ, పుల్లెంల వెంకటయ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ పాఠశాల లో
# ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

**చండూర్ నవంబర్ 14 (శాసనసభ న్యూస్):** చండూర్ పట్టణంలో గల కృష్ణవేణి పాఠశాల లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు గురువారం రోజున ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెన్స్ జి. చంద్రశేఖర్ భారత దేశ తొలి ప్రధానమంత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి దేశానికి చేసిన సేవలను కొనియాడతూ నెహ్రూ కి పిల్లలు అన్న, ఎర్ర గులాబీ పూలు అన్న అమితమైన ఇష్టం అన్నారు. వారి పుట్టినరోజు సందర్భంగా వ్యాస రచన పోటీలు, నృత్యాలు, ఆట పాటలు వివిధ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ వేడుకలో పాల్గొన్న పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.కె. మహబూబ్ అలీ, ఇన్చార్జి స్వప్న,




అకౌంటెంట్ సరిత, వైస్ ప్రిన్సిపల్ మిల్కీ రాజు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# భారత తొలి ప్రధానమంత్రి జవహార్
# లాల్ నెహ్రూ జయంతి వేడుకలు



**చండూర్ నవంబర్ 14 శాసనసభ న్యూస్):** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మునుగోడు క్యాంప్ కార్యాలయంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మునుగోడు మాజీ ఎంపీపీ పోలగోని సత్యం,మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమనపల్లి సైదులు,మాజీ సర్పంచ్ తాటికొండ సైదులు, మాజీ సర్పంచ్ జనిగల సైదులు, మాజీ సర్పంచ్ నడింపల్లి యాదగిరి, మాజీ సర్పంచ్ మాధగోని రాజేష్ గౌడ్, మాజీ కోఆప్షన్ నెంబర్ అన్వర్, మేడి యాదయ్య, కుంభం చెన్నారెడ్డి, ఆరేళ్ల సైదులు,ముచ్చపోతుల నరసింహ, జనగాం ముత్యాలు, తీగల స్వామి, వరికుప్పల వెంకన్న, రవి, రవి, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి
# పథకానికి నిధులు పెంచాలని ఎస్.ఎఫ్.ఐ డిమాండ్




**శాసనసభ న్యూస్ కొండమల్లేపల్లి నవంబర్ 14 :** ఈరోజు ఎస్.ఎఫ్.ఐ దేవరకొండ కమిటీ ఆధ్వర్యంలో కొండ మల్లేపల్లి మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్ రావు గారికి మధ్యాహ్నం భోజన పథకం నిధులు పెంచాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్ష కార్యదర్శి రామావత్ లక్ష్మణ్,బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు మెస్ ఛార్జీలను ఎస్.ఎఫ్.ఐ పోరాటం ఫలితంగా పెంచారు. కానీ వసతిగృహాల విద్యార్థులే మధ్యాహ్నం భోజనం పాఠశాలలోనే చేస్తున్నారు. ఎస్.ఎఫ్.ఐ పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ లో చదివే విద్యార్థులకు మెస్ ఛార్జీలను పెంచడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ పెంచకుండా ప్రైమరీ విద్యార్థులకు 4.97 పైసలతో 6,7,8 తరగతుల విద్యార్థులకు 7.45 పైసలతో 9,10 తరగతుల విద్యార్థులకు 9.95 పైసలతో భోజనాన్ని అందిస్తున్నారన్నారు. ఖైదీలకు 87 రూపాయలతో భోజనం అందించే ప్రభుత్వాలు నేటి బాలలే రేపటి పౌరులు అని చెప్పుకుంటూ దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటాయని గొప్పలుగా సభలలో చెప్పుకుంటున్న ప్రభుత్వ పెద్దలు ఈ దేశ భవిష్యత్తు మార్చే విద్యార్థులకు పది రూపాయల లోపు మధ్యాహ్న భోజనం పెట్టడం సిగ్గుచేటు అన్నారు. కాబట్టి తక్షణమే పేద విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపించకుండా మధ్యాహ్న భోజనం మెనూ ను పెంచాలని కోరారు. తక్షణమే విద్యాసంస్థలో ఉన్న సమస్యలనుప్రభుత్వ విద్యాధికారులు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. మధ్యాహ్న భోజనం మెనూ పెంచకుంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులతో ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, వంశీకృష్ణ,,రాజేష్,మనోహర్, మంజుల, స్వాతి,రేణుక నాయకులు పాల్గొనడం జరిగింది.

## ఎంపీ యుపిఎస్ కొండాపురంలో బాలల దినోత్సవ వేడుకలు

**చండూర్ నవంబర్ 14 (శాసనసభ న్యూస్):** చాచా నెహ్రూ 135 జయంతిని పురస్కరించుకొని ఎంపీ యుపిఎస్ కొండాపురంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ భూతం ముత్యాలు గారు ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి వారు చేసిన సేవలు కొనియాడుతూ వారికి పిల్లలన్న ఎర్ర గులాబీలు అన్న చాలా ఇష్టమని ఆయన పుట్టినరోజులు దేశవ్యాప్తంగా బాలల దినోత్సవం ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నారని, ఈ సంవత్సరం మన పాఠశాలలో వేడుకలు నిర్వహిస్తూ అందులో భాగంగా పిల్లలచే పాటలు డాన్స్ నృత్య ప్రదర్శన అలాగే స్పీచ్ తదితర




ఆక్టివిటీస్ చేయిస్తూ ఈ సందర్భంగా పిల్లలకు ఆట పోటీలు కూడా నిర్వహించారు.

## ముమ్మరంగా కొనసాగుతున్న కులగణన, కుటుంబ సమగ్ర సర్వే

**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి నవంబర్ 14 :** రాష్ట్రవ్యాప్తంగా కులగణన, ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించింది. ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ముందుగా ఇంటి నెంబరు, అందులో నివసిస్తున్న యజమాని పేరు నమోదు, స్థిర, చరాస్తులు తదితర వివరాల నమోదు ప్రక్రియ సాగింది. ఇందులో ఒక్కొక్క ఎన్యుమరేటర్ కు గాను 150 నుంచి 175 ఇళ్లు కేటాయించి, వివరాలు నమోదు చేయనున్నారు. ఈ నేపథ్యంలో చింతపల్లి మండల కేంద్రంలో గురువారం నాడు ఎన్యుమరేటర్ జల్ల పద్మావతి బీసీ కాలనీలోని 11వ వార్డులో ఇంటింటికి తిరిగి ప్రజల నుండి వివరాలు తెలుసుకొని నమోదు చేశారు. నాకు 200 ఇల్లు కేటాయించారని, మూడు రోజులు స్టిక్కర్లు



అతికించి సర్వే ప్రారంభించామన్నారు. ఒక్కొక్క ఇంటి వద్ద కనీసం 30 నిమిషాలకు పైగా సమయం తీసుకుంటుంది. కొంతమంది వద్ద సరైన వివరాలు లేక సమయం చాలా పడుతుందని, ప్రతి ఒక్కరు సకాలంలో సహకరించాలని ఆమె పేర్కొన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్ 4 ఫలితాలు విడుదల

**చండూర్ నవంబర్ 14 (శాసనసభ న్యూస్):** తెలంగాణ గ్రూప్-4 అభ్యర్థులకు బిగ్ అలర్ట్. తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్-4 ఫలితాలు గురువారం రోజు విడుదలయ్యాయి. గ్రూప్-4 ఫలితాలు విడుదల చేస్తున్నట్లు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ గురువారం తెలిపారు. 8,084 మందితో కూడిన ప్రొవిజినల్ జాబితాను విడుదల చేసింది. డిసెంబర్ 1, 2022న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 8,180 పోస్టులకు 9,51,321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు కమిషన్ తెలిపింది. ఈ పరీక్షలకు హాజరైన



అభ్యర్థులు తమ ఫలితాలను హెచ్.టి.టి.పి.ఎస్://డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ.టి.ఎస్.పి.ఎస్.గవర్నమెంట్.ఇన్/ వెబ్‌సైట్ ద్వారా చూసుకోవచ్చు.

## కార్తీక పౌర్ణమి పండుగ ప్రాముఖ్యత

**చండూర్ నవంబర్ 14 (శాసనసభ న్యూస్):** కార్తీక మాసంలోని శుక్లపక్ష పౌర్ణమి రోజున కార్తీక పౌర్ణమి పండుగను జరుపుకుంటారు. ఈ రోజున పవిత్ర నదులలో స్నానం చేస్తే మోక్షం, లభిస్తుందని సర్వ పాపాల నుంచి విముక్తి లభిస్తుందని భక్తులు నమ్ముతారు. ఆవునేతిలో ఉంచిన 365 వత్తులను దేవుడి ముందు వెలిగించి పాపాలను తొలగించి, ముక్తి ప్రసాదించమని కోరుకుంటారు. రోజంతా ఉపవాసం ఉండి శివాలయం లేదా వైష్ణవ ఆలయంలో దీపాలను వెలిగిస్తారు. ఈరోజు చేసే పుణ్యకార్యాలతో సకల శుభాలు కలుగుతాయని విశ్వాసం.



## నల్లవెల్లిలో బిజెపి నుండి కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**యాచారం శాసనసభ న్యూస్ ( నవంబర్ 14) :** మండల పరిధిలో నల్లవెల్లిలో మాజీ ఎంపిటిసి ఈదులకంటి లక్ష్మీపతి గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కానమోని జంగయ్య అధ్యక్షతనతో బిజెపి నుండి కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరుకలు జరిగాయి . గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు జిల్లా జంగయ్య, జిల్లా వెంకటేష్, జిల్లా రవి, ఎరుపుల మహేష్, ఎరుపుల రవి ని సాధారణంగా



ఆహ్వానించి చేయి గుర్తు శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో గ్రామంలో ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద ప్రజలందరికీ అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఉచిత బస్సు, ఉచిత కరెంటు, ఉచిత గ్యాస్ లాంటి పథకాలు అమలు చేస్తుందన్నారు. భవిష్యత్తులో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పించన్లు మంజూరు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్



పార్టీ నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి ఓర్వలేక, బిజెపి నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను గందరగోళానికి గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా బిజెపి నేతలు పునరాలోచించుకోవాలని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు కాసాని వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కానమోనీ అశోక్, మాజీ వార్డు సభ్యులు జిల్లా రమేష్, యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు దేరంగుల కొండల్, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 24న ఎన్ఎంఎంఎస్ పరీక్ష హాల్‌టికెట్లు విడుదల చేసిన ఎస్సెస్సీబోర్డు

**చండూర్ నవంబర్ 14 శాసనసభ న్యూస్) :** నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఈ నెల 24న ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు హాజరయ్యే వారి హాల్‌టికెట్లను అధికారులు బుధవారం విడుదల చేశారు. ఆయా హాల్‌టికెట్లను హెచ్.టి.టి.పి.ఎస్//బి.ఎస్.ఇ.తెలంగాణ.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు. అభ్యర్థులు తమ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఆధారంగా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చున్నారు.

## నారాయణ పాఠశాలలో విద్యా అవకాశాలు – భవిష్యత్తు ప్రణాళిక పై సదస్సు




**వనస్థలిపురం, శాసనసభ న్యూస్ నవంబర్ 14 :** వనస్థలిపురం జోన్ నారాయణ పాఠశాలలో 13వ తేదీన పదవ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నారాయణ వనస్థలిపురం (సీబీఎస్సీ) పాఠశాలలో ఉన్నత 'విద్యావకాశాలు-భవిష్యత్ ప్రణాళికల గురించి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిఎం గోపాల్ రెడ్డి , ఏ జిఎం రవీంద్ర బాబు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు . ఈ కార్యక్రమంలో వక్తలుగా సి. ఓ- ఆర్ అండ్ డి విజయ, కళాశాల డీన్ రాధాకిషన్, సి ఓ- డిన్ పద్మారాణి, ఆర్ అండ్ డి శివరంజని పాల్గొని విద్యార్థులు తమ బంగారు భవిష్యత్ సాకారం కోసం ప్రణాళిక పట్టుదలతో పాటు ఆచరణ ఆత్మవిశ్వాసం ముఖ్యమని తెలియజేసారు. జీవితంలో ఉన్నత శిఖరాలని చేరుకోవాలంటే విద్య అవసరం, విద్య మనలో అంతర్గతంగా దాగివున్న జ్ఞానాన్ని వెలికి తీస్తుందని, అందుకు ఏకాగ్రత అవసరమనీ, విద్యద్వారా మనం ప్రపంచం యొక్క పరిమితులను అధిగమించే, సృజనాత్మకతను పెంచుతుందని తెలియజేశారు. అలాగే ప్రస్తుతం పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి అవసరమైన సలహాలు సూచనలు అందించి విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం జోన్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అను సింగ్, లావణ్య రెడ్డి, బాజ్జి, రవికుమార్, మంధవి, నౌషన్ ఫాతిమా తదితరులు ఉన్నారు.